
www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:50 WEDNESDAY ,JULY 1,2026 PAGES:8 COST: 4 /-
ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 50 బుధవారం 1 జూలై 2026 పేజీలు :8 వెల: 4/-

## ధాన్యం ఉత్పత్తి, సేకరణలో దేశంలోనే
# తెలంగాణ టాప్




హంస కలం వార్త: గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను అన్ని రంగాల్లో విధ్వంసం చేసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. హైదరాబాద్‌లో జరిగిన రైతు భరోసా సభలో మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం మిగతా2లో




## భద్రాద్రి కొత్తగూడెంలో ఈగల్ ఫోర్స్ మెరుపు దాడి

హంస కలం వార్త: జిల్లాలో ఈగల్ ఫోర్స్, స్థానిక పోలీసులు.. భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు చేశారు. సారపాక ఐటీసీ వెస్ట్ గేట్ సమీపంలో పోలీసులు ము మ్మరంగా వాహన తనిఖీలు చేపటా ్టరు. ఈ క్రమంలో ఒడిశా అడవుల నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా ఉత్తరప్ర దేశ్‌కు అక్రమంగా తరలిస్తున్న భారీ గంజాయి రవాణాను పోలీసులు అడ్డు కున్నారు. నిందితులు మిగతా2లో

# హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ విస్తరణకు ఆహ్వానం



హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ విస్తరించండి.. సునీల్ మిట్టల్‌కు సీఎం రేవంత్ ఆహ్వానం

సీఎం రేవంత్‌తో సునీల్ మిట్టల్ భేటీ డిజిటల్, క్లౌడ్, ఏఐ రంగాలపై దృష్టి పెట్టాలని సూచన

తెలంగాణ పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా వివరణ

హంస కలం వార్త: తెలంగాణలో డిజిటల్ రంగంలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని భారతి ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యంగా హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకొని ఎయిర్‌టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధ మిగతా2లో




## భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి..

-తెలంగాణలో సర్వర్లు డౌన్!
-రెండు రోజులుగా పనిచేయని సర్వర్లు!
-స్తంభించిన స్లాట్ బుకింగ్, చలాన్, ఈ-కేవైసీ సేవలు
-కార్యాలయాల వద్ద ప్రజలు పడిగాపులు
-మూడు నెలల్లో ఇది నాలుగోసారి
-సర్వర్ల పునరుద్ధరణకు సాంకేతిక బృందం కసరత్తు

# రైతు భరోసా నిధులు విడుదల




హంస కలం వార్త : తెలంగాణలో రైతు భరోసా నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. తొలి విడతలో రెండు ఎకరాల లోపు భూమి కలిగిన 41.37 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 2,482 కోట్లను నేరుగా జమ చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. రైతుల పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. 30 నెలల ప్రజాపాలనలో రైతు తలెత్తుకునేలా పాలన అందిస్తున్నామని అన్నారు. వ్యవసాయం దండగ కాదని, పండుగగా భావించే పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడే సమయానికి రాష్ట్ర అప్పు మిగతా2లో



# భూ యాజమాన్య హక్కులు ఆలయాలకే ఉండాలి

హంస కలం వార్త :స్థలాలు ఎవరికి కేటాయించినప్పటికీ, ఆయా భూము లపై పూర్తి యాజమాన్య హక్కులు మాత్రం ఆలయాలకే ఉండేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహా స్వామి ఆలయ సమగ్ర అభివృద్ధి, భూ కేటాయింపులపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ మిగతా2లో

## విజయవాడ బైపాస్ లో ఘోర రోడ్డు ప్రమాదం..



-బైపాస్‌పై ఘోర రోడ్డు ప్రమాదం
-రెండు లారీల మధ్య నలిగిపోయి నుజ్జునుజ్జయిన కారు
-ఓ స్కూటరిస్టుకు కూడా ప్రమాదం
-ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి, ఒకరి పరిస్థితి విషమం
-అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసుల ప్రాథమిక నిర్ధారణ
-ఘటనాస్థలిలో భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్

హంస కలం వార్త: ఉమ్మడి కృష్ణా జిల్లాలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమా దం చోటుచేసుకుంది. గన్నవరం సమీపంలోని బి.బి. గూడెం వద్ద కొత్త జాతీయ రహదారి (విజయ వాడ వెస్ట్ బైపాస్)పై ఒకేసారి పలు వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గు రు అక్కడికక్కడే దుర్మరణం చెంద గా, మరొకరు మిగతా2లో

# జులై 2న తెలంగాణ కేబినెట్ అత్యవసర భేటీ



మధ్యాహ్నం 3 గంటలకు రేవంత్ అధ్యక్షతన కేబినెట్ భేటీ
ఈరోజు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిన చీఫ్ సెక్రటరీ
ఉన్నతాధికారులంతా కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని ఆదే

హంస కలం వార్త : తెలంగాణ రాష్ట్ర కేబినెట్ అత్యవసరంగా భేటీ కానుంది. జులై 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ కీలక సమావేశం జరగబోతోంది. సచివాలయంలోని 6వ అంతస్తులో మిగతా2లో

## రాజాసింగ్‌కు నాంపల్లి ప్రత్యేక కోర్టులో భారీ ఊరట




- 2022లో మునావర్ ఫారూఖీ షోను వ్యతిరేకించిన రాజాసింగ్ దేశవ్యాప్తంగా దుమారం రేపిన రాజాసింగ్ వీడియో
- మంగళ్‌హాట్ పీఎస్ లో కేసులు నమోదు
- కేసును పూర్తిగా కొట్టివేసిన ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు

## తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు



సిగాచి పరిశ్రమలో 54 మంది కార్మికులు సజీవదహనమైన ఘటనను గుర్తు చేసుకున్న హరీశ్

20 కిలోమీటర్ల దూరంలో ఉన్నా రేవంత్ రెడ్డి రాలేదని విమర్శ

మృతి చెందిన కార్మికుల కుటుంబాలను మోసం చేయవద్దని వ్యాఖ్య

హంస కలం వార్త : తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచి పరిశ్రమలో కూలి కోసం వలస వచ్చిన 54 మంది పేద కార్మికులు సజీవదహనమైన ఘోర ఘటనకు ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ వైఫల్యం, సిగాచి యాజమాన్య నిర్లక్ష్యం కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోయారని విమర్శించారు. ఘటన జరిగిన రోజున హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో ఉన్నా 20 కి.మీ దూరంలోని ఘటన స్థలానికి సీఎం రేవంత్ రాకపోవడం, బాధిత కుటుంబాల కన్నీళ్లు మిగతా2లో

# మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చేయూతనిస్తుంది



రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ,కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి

హంస కలం వార్త: రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చేయూత ఇస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ,కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. మంగళ వారం జిల్లాలోని జైపూర్ మండలం గంగిపల్లి గ్రామంలో గ్రామైక్య సంఘ భవనం ,ఇందిరమ్మ ఇంటిని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మండల తహసిల్దార్ వనజ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు చేయూత అందించి ప్రోత్సహిస్తుందని తెలిపారు. గ్రామంలో 15 లక్షల రూపాయల డి ఎం ఎఫ్ టి 2022-23 నిధులతో గ్రామైక్య మిగతా2లో

# రైతు భరోసా నిధులు విడుదల

తెలంగాణ ఏర్పడే సమయానికి రాష్ట్ర అప్పు రూ.69 వేల కోట్లు ఉండగా, 2023 నాటికి అది రూ.8.11 లక్షల కోట్లకు చేరిందని అన్నారు. గత పదేళ్లలో దాదాపు రూ.7 లక్షల కోట్ల అప్పు చేసి ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కల్వకుంట్ల కుటుంబం చేసిన అప్పులు, తప్పుల భారం ఇప్పుడు తమ ప్రభుత్వం భరిస్తోందని రేవంత్ రెడ్డి అన్నారు. 'బకాయిలు పెట్టింది బకాసురుడు... కట్టే పాపం మాకా?' అంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు వాయిదాల పద్ధతిలో జీతాలు చెల్లించే పరిస్థితి నెలకొందని, ధనిక రాష్ట్రాన్ని ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి తీసుకెళ్లారని విమర్శించారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు తెలంగాణ పరువు తీశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రజాపాలనలో ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రైతు భరోసా పథకం కింద రూ.36 వేల కోట్లు రైతులకు అందించినట్లు సీఎం వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ నిలిపివేస్తారనే దుష్ప్రచారం చేశారని, కానీ 2004లో రైతులకు ఉచిత విద్యుత్‌ను తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. రైతుల కోసం ప్రతి నెల సుమారు రూ.6 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు, రైతు బీమా కోసం రూ.4 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కోసం రూ.80 వేల కోట్లు వ్యయం చేసినట్లు సీఎం రేవంత్ వివరించారు.

# భూ యాజమాన్య హక్కులు ఆలయాలకే ఉండాలి: సీఎం రేవంత్

ఈ సందర్భంగా ఆలయ భూముల పరిరక్షణ, భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన నిర్మాణాలపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. యాదగిరిగుట్టలో హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు భూమి కేటాయింపు విషయమై స్పందిస్తూ, సదరు ల్యాండ్‌ను ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారమే కేటాయించాలని సీఎం స్పష్టం చేశారు. అలాగే, ఆలయ పరిధిలో వివిధ మఠాలకు స్థలాలు ఇచ్చే అంశంపై స్పష్టమైన, పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కుల సంఘాలకు స్థలాల కేటాయింపులపై కూడా నిర్దిష్ట నిబంధనలతో కూడిన ఒక పాలసీని సిద్ధం చేయాలని చెప్పారు. ఈ భూ కేటాయింపుల ప్రక్రియలో దేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమలలో అనుసరిస్తున్న నిబంధనలు, విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. యాదగిరిగుట్టపై భక్తుల వసతి కోసం నిర్మించతలపెట్టిన అతిథిగృహాల నిర్మాణంలోనూ తిరుమల మోడల్‌నే అనుసరించాలని పేర్కొన్నారు. కొండపై కాటేజీలు, గెస్ట్‌హౌస్‌ల నిర్మాణం చేపట్టేం దుకు ఆసక్తి చూపే దాతలు, సంస్థల వివరాలతో కూడిన జాబితాను తక్షణమే రూపొందిం చాలని, వీరికి విడతలవారీగా నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. ఆలయ పరిసరాల్లో భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాలను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం పద్ధతిలో ఒక ప్రత్యేక టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇక యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణ పనులు, నాణ్యతపై గతంలో నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి, దానిపై వారం రోజుల్లోగా సమగ్ర నివేదికను తనకు అందజేయాలని ముఖ్యమంత్రి అధికారులకు డెడ్‌లైన్ విధించారు.

# హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ విస్తరణకు ఆహ్వానం

తెలంగాణలో డిజిటల్ రంగంలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని భారతి ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యంగా హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకొని ఎయిర్‌టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధ రంగాల్లో కార్యకలాపాలను విస్తరించాలని సూచించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధీ పెవిలియన్‌లో రేవంత్ రెడ్డిని మంగళవారం సునీల్ భారతి మిట్టల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడులకు అనుకూలంగా తీసుకొచ్చిన సంస్కరణలపై సీఎం వివరించారు. రాష్ట్రం పెట్టుబడులకు అత్యంత అనుకూల గమ్యస్థానంగా మారుతోందని పేర్కొన్న సీఎం విద్యా రంగంలో చేపడుతున్న మార్పులను కూడా వివరించారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. పారిశ్రామిక రంగ అవసరాలకు తగ్గట్టుగా యువతకు నైపుణ్యాలు అందించేందుకు ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ గురించి కూడా సునీల్ మిట్టల్‌కు వివరించారు. అలాగే ఐటీఐలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీలు) మారుస్తున్నట్లు తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలను కూడా ఆధునికీకరిస్తున్నామని, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో యువతను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో సాంకేతిక రంగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఎయిర్‌టెల్ కూడా తన కార్యకలాపాలను మరింత విస్తరించాలని కోరారు.

# మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చేయూతనిస్తుంది

గ్రామంలో 15 లక్షల రూపాయల డి ఎం ఎఫ్ టి 2022-23 నిధులతో గ్రామైక్య సంఘ భవనం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మహిళల సంక్షేమంలో భాగంగా వివిధ వ్యాపార రంగాలలో మహిళా భాగస్వామ్యాన్ని స్వాగతిస్తూ అవసరమైన రుణ సదుపాయం కల్పించి ప్రోత్సహిస్తుందని, మహిళా సంక్షేమంలో భాగంగా అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.మహిళను కుటుంబ పెద్దగా గుర్తిస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని తెలిపారు.స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా వడ్డీ లేని రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని, రాష్ట్రంలో 21 వేల కోట్ల రూపాయలు స్వయం సహాయక సంఘాలకు అందించడం జరిగిందని తెలిపారు. రుణ సదుపాయం పొందిన స్వయం సహాయక సంఘాలు సకాలంలో తిరిగి చెల్లించినట్లయితే మరింత రుణం పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్య అభ్యసించే విద్యార్థులకు ఏకరూప దుస్తుల తయారీలో స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వాములను చేస్తూ చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. పెట్రోల్ బంకుల ఏర్పాటు, నిర్వహణకు మహిళా సంఘాలకు అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయబడి వచ్చే నెలాఖరుకు దాదాపు 1 వేయి ఇండ్లు పూర్తి కానున్నాయని, మిగతావి పురోగతిలో ఉన్నాయని తెలిపారు. రేషన్ కార్డుదారులకు చౌక ధరలు దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ జిల్లాలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని, ప్రభుత్వ పాఠశాలలను సకల సదుపాయాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు.వైద్యరంగంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని, ప్రభుత్వ ఆసుపత్రులను ఏర్పాటు చేసి వైద్య సేవలు మరింత వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు.రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 5 లక్షల రూపాయల పరిమితిని 10 లక్షల రూపాయలకు పెంపొందించి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు.వచ్చే నెల నుండి పెన్షన్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలను సరిదిద్దుతూ రాష్ట్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి పథకాలను అధికారుల సమన్వయంతో జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డులు,వివిధ వ్యాపారాలలో మహిళల భాగస్వామ్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, గుడిసెలలో ఉండేవారు, అర్హులైన నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.జిల్లా కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి భవన్ ఏర్పాటు చేయడం జరిగిందని,జిల్లాలోని పలు ప్రాంతాలలో మహిళ భవనాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మహిళా సంఘాల సమావేశాలు,ఇతర పనులకు వినియోగించుకోవచ్చని తెలిపారు.మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు.అనంతరం విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు.అంతకుముందు జిల్లా కలెక్టర్,మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో కలిసి గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. జూలై 24వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి అర్హులైన ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, పూరించిన తర్వాత సేకరించాలని,ఫారాల పంపిణీ ప్రక్రియను జూలై 1వ తేదీ నాటికి పూర్తి చేసి ప్రతి రోజూ పురోగతి నివేదికలను సమర్పించాలని తెలిపారు.ప్రతి బూత్ స్థాయి అధికారి తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించి,ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో నమోదై ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదు కావడం చట్టరీత్యా శిక్షార్హమని ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.బూత్ స్థాయి అధికారులు బి.ఎల్.ఓ. యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలని, ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించిన అనంతరం ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియ పూర్తి అయిన స్టిక్కర్‌ను ప్రతి ఇంటికి అతికించాలని, ఫారాల పూరణ,సమర్పణపై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రాజాసింగ్‌కు నాంపల్లి ప్రత్యేక కోర్టులో భారీ ఊరట

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు నుంచి భారీ ఊరట లభించింది. ఆయనపై నమోదైన కేసును కోర్టు పూర్తిగా కొట్టివేస్తూ, రాజాసింగ్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ కోర్టు తుది తీర్పునిచ్చింది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత ఆయనపై మోపిన ఆరోపణలకు సరైన సాక్ష్యాధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. కేసు వివరాల్లోకి వెళితే... 2022 ఆగస్టులో హైదరాబాద్‌లో స్టాండప్ కమెడియన్ మునావర్ ఫారూఖీ షో నిర్వహించడాన్ని రాజాసింగ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలో ఆయన యూట్యూబ్‌లో విడుదల చేసిన ఒక వీడియో దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. రాజాసింగ్ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడారంటూ నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై స్పందించిన మంగళ్‌హాట్ పోలీసులు ఆయనపై 153ఏ, 295ఏ, 505(2) తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. 2022 ఆగస్టు 23న పోలీసులు రాజాసింగ్‌ను అరెస్ట్ చేసినప్పటికీ, అరెస్ట్ ప్రక్రియలో సరైన నిబంధనలు (41ఏ సీఆర్‌పీసీ నోటీసు వంటివి) పాటించలేదంటూ స్థానిక కోర్టు రిమాండ్‌ను తిరస్కరించి, ఆయనను వెంటనే విడుదల చేసింది. అయితే, ఆ తర్వాత నగరంలో చోటుచేసుకున్న నిరసనలు, శాంతిభద్రతల సమస్యలను కారణాంగా చూపిస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పోలీసులు ఆయనపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. దీంతో రాజాసింగ్ దాదాపు 77 రోజుల పాటు జైలులో గడపాల్సి వచ్చింది.

## విజయవాడ బైపాస్ లో ఘోర రోడ్డు ప్రమాదం..

వివరాల్లోకి వెళితే, విజయవాడ నుంచి ఏలూరు వైపు వెళుతున్న ఓ కారును వెనుక నుంచి వేగంగా వచ్చిన కంటైనర్ లారీ బలం గా ఢీకొట్టింది. ఈ ధాటికి కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆయిల్ ట్యాంకర్ లారీని బలంగా గుద్దుకుంది. రెండు లారీల మధ్య కారు పూర్తిగా నలిగి పోయి నుజ్జు నుజ్జ యింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న తల్లి, బిడ్డ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. నాలుగేళ్ల చిన్నారి ప్రాణాలు కోల్పోవడం అం దరినీ కలచి వేసింది. కారులో ఉన్న మరో వ్యక్తి ఈ ప్రమాదంలో రెండు చేతులు కోల్పో యి, తీవ్ర రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. అదే సమయంలో, రోడ్డుపై వేగంగా వచ్చిన ఓ స్కూటరిస్ట్ కూడా ప్రమా దానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అదుపుతప్పిన ఆయిల్ ట్యాంకర్ లారీ... స్కూటరిస్టును ఢీకొట్టింది. దాంతో అతడు అక్కడిక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న గన్నవరం పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు క్రేన్ల సహాయంతో ప్రమాదానికి గురైన వాహనాల ను తొలగించి, రాకపోకలను పునరుద్ధరించా రు. మృతదేహాలను, క్షతగాత్రుడిని గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీ అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జులై 2న తెలంగాణ కేబినెట్ అత్యవసర భేటీ

తెలంగాణ రాష్ట్ర కేబినెట్ అత్యవసరంగా భేటీ కానుంది. జులై 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ కీలక సమావేశం జరగబోతోంది. సచివాలయంలోని 6వ అంతస్తులో ఉన్న కేబినెట్ హాల్‌లో జరిగే ఈ 34వ మంత్రిమండలి భేటీకి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈరోజు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. కేబినెట్ సమావేశం ఖరారు కావడంతో సచివాలయంలో పరిపాలనా పరమైన హడావుడి మొదలైంది. ప్రభుత్వంలోని అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు తమ తమ శాఖలకు సంబంధించిన అజెండా అంశాలను సిద్ధం చేసే పనిలో పడ్డారు. ఈ ప్రతిపాదనలను తెలుగు అనువాదంతో సహా రేపు మధ్యాహ్నం ఒంటి గంటకల్లా సాధారణ పరిపాలన (కేబినెట్) శాఖకు పంపాలని సీఎస్ ఆదేశాలు జారీ చేశారు. ఒకవేళ ఏ శాఖలోనైనా ఎలాంటి అజెండా అంశాలు లేకపోతే.. 'నిల్' రిపోర్టునైనా సరే నిర్ణీత సమయానికి సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. మరోవైపు, సమావేశం జరిగే సమయంలో ఎలాంటి సాంకేతిక లేదా పరిపాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తుగా గట్టి చర్యలు చేపట్టింది. కేబినెట్ భేటీ ముగిసే వరకు ప్రభుత్వ ఉన్నతాధికారులు, కార్యదర్శులందరూ కచ్చితంగా తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని సీఎస్ స్పష్టం చేశారు. దీంతో పాటు ప్రొటోకాల్ డైరెక్టర్, హార్టికల్చర్ డైరెక్టర్, ట్రాన్స్‌లేషన్స్ డైరెక్టర్, ౧+టూ యూనిట్ మేనేజర్లు సమావేశానికి అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆదేశించారు.

## ధాన్యం ఉత్పత్తి, సేకరణలో దేశంలోనే తెలంగాణ టాప్

ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షలలోపు రైతు రుణాలను మాఫీ చేశామని మంత్రి తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రైతుల ఖాతాల్లో రూ.22 వేల కోట్లకు పైగా జమ చేసినట్లు వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించినప్పటికీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని అన్నారు. రైతు సమస్యలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. 'కేసీఆర్ ఒక్క రైతుబంధు ఇచ్చి.. అన్నీ బంద్ చేశారు' అంటూ మంత్రి తుమ్మల వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు అందించే పలు వ్యవసాయ పథకాలను కూడా అప్పటి ప్రభుత్వం అమలు చేయకుండా నిలిపివేసిందని ఆరోపించారు. తెలంగాణ ప్రస్తుతం ధాన్యం ఉత్పత్తి, ధాన్యం సేకరణలో దేశంలోనే అగ్రస్థానంలో ఉందని మంత్రి పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ఆయిల్‌పామ్ సాగులో కూడా తెలంగాణను దేశంలో నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులకు ఎరువుల పంపిణీ, వ్యవసాయ సేవలను మరింత పారదర్శకంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్ మంచి ఫలితాలు ఇస్తోందని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే తరహా యాప్‌ను తీసుకొస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.. తెలంగాణలో సర్వర్లు డౌన్!

తెలంగాణ వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు స్తంభించిపోయాయి. సాంకేతిక లోపాలతో ప్రధాన సర్వర్లు గత రెండు రోజులుగా పనిచేయడంలేదని తెలుస్తోంది. భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్వర్లు పనిచేయకపోవడంతో కొత్త స్లాట్ బుకింగ్‌లు, చలాన్ చెల్లింపులు, ఈ-కేవైసీ వంటి ఆన్‌లైన్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ముందుగానే ముహూర్తాలు చూసుకుని స్లాట్‌లు బుక్ చేసుకున్న క్రయ, విక్రయదారులు సాక్షులతో కలిసి కార్యాలయాలకు చేరుకున్నా, గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత మూడు నెలల్లో సాంకేతిక సమస్యల కారణంగా రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోవడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. తరచూ ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని ప్రజలు, డాక్యుమెంట్ రైటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక లోపం ఎక్కడ తలెత్తిందనే విషయంపై క్షేత్రస్థాయి అధికారులకు కూడా సమాచారం లేదు. వారు ప్రజలకు సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారు. దీంతో కార్యాలయాల వద్ద గందరగోళం నెలకొంది. సాఫ్ట్‌వేర్‌లో ఏర్పడిన సమస్యను గుర్తించి సర్వర్లను పునరుద్ధరించేందుకు రాష్ట్ర స్థాయి సాంకేతిక బృందం చర్యలు చేపట్టిందని ఉన్నతాధికారులు తెలిపారు. సేవలు ఎప్పటికి పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తారనే విషయంపై మాత్రం ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

## తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు

సీఎం రేవంత్ రాకపోవడం, బాధిత కుటుంబాల కన్నీళ్లు తుడవకపోవడం హృదయవిదారకమన్నారు. విమర్శలు రావడంతో మరుసటి రోజు వచ్చారని విమర్శించారు. రేవంత్ రెడ్డి మృతదేహాల సాక్షిగా ప్రతి కుటుంబానికి రూ.1 కోటి ఇస్తానని ప్రకటించినా, ప్రభుత్వం తరపున కేవలం రూ.1 లక్ష మాత్రమే ఇచ్చింది. కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్స్యూరెన్స్, వైద్య ఖర్చులను కూడా పరిహారంలో చేర్చి మోసం చేశారని ఆరోపించారు. డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పడం, ఉద్యోగాలు ఇవ్వకపోవడం, క్షతగాత్రులకు సహాయం చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఈ ఘటన సామూహిక హత్య అని, 818 న్యాకి అనుమతి తీసుకుని 1777 న్యా నడపడం, సేఫ్టీ గార్డ్స్, ఫైర్ చీూజ, డస్ట్ కంట్రోల్ వ్యవస్థ లేకపోవడం వంటి నిర్లక్ష్యాలు విచారణలో తేలాయన్నారు. ప్రభుత్వం యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడం, ఎండీని అరెస్టు చేసి వెంటనే బెయిల్‌పై విడుదల చేయడం లోపాయికారీ ఒప్పందాన్ని సూచిస్తుందని విమర్శించారు. సిగాచి డైరెక్టర్ల ఆస్తులను అటాచ్ చేసి కోటి రూపాయల పరిహారం తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. "మాట తప్పడం మీకు అలవాటే కానీ, ప్రాణాలు కోల్పోయిన పేద కార్మికుల కుటుంబాలను మోసం చేయవద్దు" అని హరీశ్ రావు వ్యాఖ్యానించారు.

## భద్రాద్రి కొత్తగూడెంలో ఈగల్ ఫోర్స్ మెరుపు దాడి..

ఈ క్రమంలో ఒడిశా అడవుల నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా ఉత్తరప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్న భారీ గంజాయి రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. నిందితులు పోలీసుల కళ్లు గప్పేందుకు లారీలో ప్రత్యేకంగా ఒక రహస్య భాగాన్ని ఏర్పాటు చేసి అందులో గంజాయిని దాచి తరలిస్తున్నారు. అయితే చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు లారీని సోదా చేసి, దాదాపు 525 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఈ గంజాయి విలువ మార్కెట్లో సుమారు 2.62 కోట్ల రూపాయలు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సంయుక్త ఆపరేషన్‌లో పోలీసులు ముగ్గురు నిందితులను ఘటనా స్థలంలోనే అరెస్ట్ చేశారు. గంజాయి రవాణాకు ఉపయోగిస్తున్న లారీతో పాటు, దానికి ఎస్కార్ట్‌గా వ్యవహరిస్తున్న ఒక పల్సర్ బైక్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు నిందితుల వద్ద ఉన్న 5 మొబైల్ ఫోన్లు, రూ.10,570 నగదును పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసులో పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సంపాదకీయం

# కవి ఎవరి వాడు?

ఒక కవి ఏ ప్రాంతానికి చెందినవాడనే ప్రశ్న తెలుగు సాహిత్య చరిత్రలో కొత్తది కాదు. బమ్మెర పోతన తెలంగాణవాడా కాదా? పాల్కురికి సోమన స్థానికత ఏంటి? వేములవాడ భీమకవి ఎక్కడివాడు? ఇలాంటి ప్రశ్నలు కేవలం చారిత్రక సందేహాలుగా మాత్రమే కనిపించవచ్చు. కానీ వాటి వెనుక ఉన్న మీమాంస మరింత విస్తృతమైంది. ఒక కవిని ఒక ప్రాంతానికి చెందినవాడిగా నిర్ణయించడానికి అసలు ఏ ప్రమాణాన్ని స్వీకరించాలి?

సాధారణంగా జన్మస్థలం, నివాసం, భాష, వంశపారంపర్యం వంటి అంశాలను ఆధారంగా తీసుకుంటారు. అయితే ఈ ప్రమాణాలన్నీ ఎప్పుడూ ఒకే సమాధానాన్ని ఇవ్వవు. ఒక సందర్భంలో జన్మస్థలం ముఖ్యం అనిపిస్తే, మరో సందర్భంలో భాష ప్రాధాన్యం పొందుతుంది, ఇంకొకచోట సాహిత్యమే ప్రధాన ఆధారమవుతుంది. అందుకే కవి స్థానికత అనేది కేవలం సమాచారానికి సంబంధించిన అంశం కాదు. అది సాహిత్య చరిత్రను మనం ఎలా అర్థం చేసుకుంటున్నామన్న ప్రశ్నకి సంబంధించిన అంశం కూడా.

కవులను సాహిత్య చరిత్రలు సహజంగానే ప్రాంతాల వారీగా విభజిస్తాయి. తెలంగాణ కవులు, ఆంధ్ర కవులు, రాయలసీమ కవులు అని వర్గీకరణలు చేస్తాయి. ఇది కొన్ని సందర్భాల్లో అవసరమే. ఎందుకంటే ఒక ప్రాంతపు సాంస్కృతిక చరిత్రను అర్థం చేసుకోవడానికి అక్కడి సాహిత్య సంపదను గుర్తించడం ముఖ్యం. అయితే ఈ అంశం ఇక్కడితో ఐపోలేదు. ఒక కవిని ఒక ప్రాంతానికి చేర్చడం అంటే కేవలం అతని వివరాలను నమోదు చేయడం కాదు. ఒక ప్రాంత చరిత్రలో అతనికి స్థానం కల్పించడం కూడా. అందువల్ల 'కవి ఎవరి వాడు?' అనే ప్రశ్నకు సమాధానం చెప్పే ముందు, ఆ ప్రశ్న ఎందుకు పుడుతోందో పరిశీలించాలి. ఎందుకంటే స్థానికత అనేది స్థిరంగా ఉండే వస్తువు కాదు. అది చరిత్ర, భాష, జ్ఞాపకం, సామాజిక అనుభవం, సాంస్కృతిక అనుబంధం వంటి అనేక అంశాల కలయిక.

'కవుల పుట్టుక, ఏరుల పుట్టుక ఎక్కడ జరుగుతుందో చెప్పలేం' అని ఒక నానుడి. ఇది కేవలం కవితాత్మకమైన వాక్యం అనుకుంటే దాని పరిమితి అంతే. కానీ ఈ పోలికను కొనసాగిస్తే అర్థం మరింత విస్తరిస్తుంది. ఒక నది ఎక్కడ పుట్టిందన్నదే కాదు, అది ఏ నేలల గుండా ప్రవహించిందన్నదీ అంతే ముఖ్యం. కవి విషయంలోనూ అంతే. అతడు ఎక్కడ జన్మించాడన్నది ఒక సమాచారం మాత్రమే. అతని సాహిత్యం ఏ నేలల జీవితంతో ముడిపడి ఉందన్నది కీలకం.

అందుకే ఒక కవి స్థానికతను నిర్ణయించడంలో జన్మస్థలం ఒక్కటే ప్రమాణంగా సరిపోదు. పుట్టుక అనేది వ్యక్తి నిర్ణయం కాదు. కుటుంబ పరిస్థితులు, సామాజిక ఆచారాలు, యాదృచ్ఛిక సందర్భాలు పుట్టుక స్థలాన్ని నిర్ణయిస్తాయి. తెలుగు నాట తొలి ప్రసవం అమ్మమ్మగారింట్లోనే చేసే ఆచారముంది. అలాంటప్పుడు కేవలం జన్మస్థలం ఆధారంగా స్థానికతను ఎలా నిర్ణయిస్తాం.

వేములవాడ భీమకవి విషయంలో ఇలాంటి వివాదాలే ఉన్నాయి. ఆయన ద్రాక్షారామానికి చెందినవాడని ఒక వాదన, వేములవాడ వాడేనని మరో వాదన.

జన్మస్థలం కాకపోతే పోనీ నివాస స్థలాన్ని ప్రమాణంగా తీసుకోవచ్చు అనుకుందామా! కానీ ఆ ప్రమాణం కూడా పూర్తిగా సరైంది కాదు. ఎందుకంటే ఉద్యోగం, విద్య, జీవనావసరాలు మనుషులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తీసుకెళ్తాయి. అయితే నివాసం మారినంత మాత్రాన వారివైన వైయక్తిక అనుభవాలు పూర్తిగా అంతర్ధానమైపోవు.

కేశవరెడ్డి ఉదాహరణ ఇక్కడ ప్రస్తావనార్హం. ఆయన జీవితంలో గణనీయమైన భాగం తెలంగాణలో గడిచినప్పటికీ, ఆయన రచనల్లో ప్రధానంగా కనిపించేది రాయలసీమ జీవితమే. శరీరం ఒక చోట ఉండవచ్చు. కానీ సృజనాత్మక చైతన్యం మరో ప్రపంచంతో ముడిపడి ఉండవచ్చు. అప్పుడు స్థానికతను ఏ ఆధారంతో నిర్ణయించాలి?

ఈ ప్రశ్న మనల్ని భాష వైపు తీసుకెళ్తుంది. భాషలో ప్రాంతపు జ్ఞాపకాలు ఉంటాయి. జీవన విధానాల ఆనవాళ్లు ఉంటాయి. సామాజిక సంబంధాల ముద్ర ఉంటుంది. రచయిత తన ప్రపంచాన్ని భాష ద్వారానే వ్యక్తపరుస్తాడు. అందుకే భాష స్థానికతను అర్థం చేసుకోవడానికి ఒక ముఖ్యమైన ఆధారం. అయితే అది కూడా అంతిమ ప్రమాణం కాదు.

కోరుట్ల ప్రాంతానికి చెందిన కృష్ణమాచార్య జీవితాన్ని పరిశీలిస్తే సంస్కృతం, తెలుగు, తమిళ సంప్రదాయాల సంగమం కనిపిస్తుంది. ఆయన కుటుంబ చరిత్రలోనే ఈ సాంస్కృతిక కలయికకు ఆనవాళ్లు కనిపిస్తాయి. తమిళ భాష, శ్రీవైష్ణవ సంప్రదాయం పట్ల ఉన్న మక్కువతో ఆయన అన్నగారు కుటుంబ ఇంటిపేరైన 'సిరిసెనగండ్ల'ను 'సిరిశెనహళ్'గా మార్చుకున్నారని తెలుస్తుంది. ఈ చిన్న మార్పు వెనుకనే భాష, సంప్రదాయం, సాంస్కృతిక అనుబంధాల సంక్లిష్ట స్వభావం దాగి ఉంది. ఒక వ్యక్తి తెలంగాణలో జన్మించి పెరిగినా, అతని సాంస్కృతిక దృష్టి మరో ప్రాంతపు భాషా సంప్రదాయాల వైపు విస్తరించి ఉండవచ్చు. అందువల్ల భాషను మాత్రమే ఆధారంగా చేసుకొని స్థానికతను నిర్ణయించడమూ సాధ్యం కాదు. ఎందుకంటే భాష అనేది కేవలం భౌగోళిక సరిహద్దులలో బంధించబడిన వ్యవస్థ కాదు. మతసంప్రదాయాలు, వలసలు, విద్యా కేంద్రాలు, సాహిత్య సంబంధాలు వంటి అనేక చారిత్రక ప్రక్రియల ద్వారా భాషలు పరస్పరం ప్రభావితం అవుతూంటాయి. కాబట్టి భాష స్థానికతను అర్థం చేసుకోవడానికి ఒక ముఖ్యమైన సూచిక అయినప్పటికీ, దానిని పూర్తిగా నిర్ణయించే అంతిమ ప్రమాణంగా స్వీకరించలేం.

మరి ఈ ప్రమాణాలేవీ సరిపోనప్పుడు అసలు ఇంతగా స్థానికత గురించి మాట్లాడాల్సిన అవసరం ఏంటి? కవి తనను తాను ఒక ప్రాంతానికి పరిమితం చేసుకోవాలా? అనే ప్రశ్నలు ఎవరికైనా తలెత్తినపుడు, జాషువా కవిత్వం అందుకు ఆసక్తికరమైన సమాధానాన్ని ఇస్తుంది: "నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు తరుగులేదు విశ్వనరుడ నేను" అని చెప్పినప్పుడు ఆయన మనిషిని సంకుచిత గుర్తింపుల్లో బంధించే ప్రయత్నాలను ప్రశ్నిస్తున్నాడు. అయితే దీనిని స్థానికతను నిరాకరించడంగా అర్థం చేసుకోవడం సరైంది కాదు. జాషువా విశ్వనరుడే. కానీ ఆయన కవిత్వానికి ఒక నేల ఉంది. ఒక భాష ఉంది. ఒక సామాజిక అనుభవం ఉంది. ఒక దళిత జీవన వాస్తవికత ఉంది.

# ఆపలేని ఆ ఐదు అంటే భయం!




భారతీయ సమాజం మారుతోంది. అనూహ్య వేగంతో మారుతున్న సామాజిక ధోరణులను, రాజకీయాలు పోతోన్న పోకడలను నేను చాలా సంవత్సరాలుగా నిశితంగా గమనిస్తున్నాను. ఒక పెద్ద మార్పుగా కనిపించేది కాలంలో తాత్కాలికమైనదిగాను, ప్రభావశీలతలో అప్రధానమైనదిగాను తేలిపోతుంది. కనిపించే ప్రతి మేఘమూ నిలబడి వర్షించదు. చిరుజల్లు వెదజల్లి సాగిపోతోంది. చెప్పవచ్చిన దేమిటంటే మన జీవనగంగలో ప్రతి ప్రవాహమూ లోతైనది కాదు. ఎండిపోతోన్న తావులు అందులో ఎన్నో ఉన్నాయి.

భారతదేశ చరిత్రలో 1947 ఒక కీలక సంవత్సరం. అదొక కొత్త ఆరంభం. దరిమిలా మన జాతి జీవనంలో అనేక ప్రభావాలు, ప్రాబల్యాలను దేశప్రజలు గుర్తించారు. అయితే అవి చాలా వరకు స్వల్పకాల అద్భుతాలుగా మిగిలిపోయాయి. ఆరంభదశలో ఉన్న మార్పులు అనేకం విశాల ప్రజానీకం దృష్టికెక్కలేదు. అయితే ఈ మార్పులు సంఖ్యానేక భారతీయుల జీవితాలను మౌనంగా ప్రభావితం చేస్తున్నాయి. ఉదాహరణకు గాంధీజీ మహాత్ముడిగా భాసించారు. ఎందరో ఆయన్ను దైవ సమానుడిగా గౌరవించారు. గాంధేయవాదుల సంఖ్య తక్కువేమీ కాదు. గాంధేయ జీవన విధానం, అహింస, సత్యాగ్రహం, చరఖా, పౌర ఉల్లంఘన మొదలైనవి గాంధీ అనంతరం రెండు దశాబ్దాలకు మించి మనగలగలేకపోయాయి. స్వాతంత్ర్యానంతరం శీఘ్ర పట్టణీకరణ పెరుగుదలను చాలా తక్కువ మంది ఊహించారు. మరింత తక్కువ మంది వాతావరణ మార్పును గుర్తించారు. అంతకంటే చాలా తక్కువ మంది సమాజం, శాస్త్ర సాంకేతిక రంగాల పురోగతి మధ్య సంకీర్ణ సంబంధాన్ని అర్థం చేసుకున్నారు.

'జోస్యం చెప్పడం ఒక కష్టసాధ్యమైన విషయం. ముఖ్యంగా భవిష్యత్తు గురించి అయితే' అని నీల్స్ బోర్ (ఇరవయో శతాబ్ది వైజ్ఞానిక విప్లవకారుల్లో అగ్రగణ్యుడు) అన్నారు. ఆయన తాత్విక హాస్యంలో సామాన్య వివేకం పరిపూర్ణంగా ఉన్నది. అయినప్పటికీ భవిష్యత్తు అనే నిషిద్ధ ప్రదేశాన్ని దర్శించేందుకు నేను సాహసిస్తున్నాను. మన సమాజ జీవితంలో అయిదు ధోరణులు క్రమ క్రమంగా శక్తిని, వేగాన్ని పుంజుకోవడాన్ని నేను గమనించాను. వాటిని నేను ఏవగించుకుంటున్నాను, కొన్నిటికి భయపడుతున్నాను కూడా. అయితే అవి ఆపడానికి వీలు లేనివి. ఎవరూ ఆపలేనివిగా కనిపిస్తున్నాయి.

మన ప్రజాస్వామ్యం క్షీణిస్తోంది. ప్రజల యొక్క, ప్రజల చేత, ప్రజల కొరకు పాలనే ప్రజాస్వామ్యం. ఇది ఒక సార్వజనీన సత్యం. వ్యక్తులు స్వేచ్ఛగా జన్మిస్తారు. అనేక స్వేచ్ఛల విషయంలో వారికి స్వతస్సిద్ధ హక్కులు ఉంటాయి. ప్రజల హక్కులను గౌరవించి, వాటిని కాపాడే ప్రభుత్వమే ప్రజాస్వామిక ప్రభుత్వం.. ప్రజల హక్కులను పరిరక్షించి, వాటిని ప్రతి ఒక్కరి జీవితంలో ఆచరణలోకి తీసుకువచ్చేందుకు స్వతంత్ర సంస్థలను నెలకొల్పడం ప్రజాస్వామ్య ప్రభుత్వ విధ్యుక్త ధర్మం. ఈ కర్తవ్య నిర్వహణను సక్రమంగా పాటించని ప్రభుత్వం ప్రజాస్వామిక ప్రభుత్వం కానేరదు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్యం, భావప్రకటనా స్వేచ్ఛ అంతకంతకూ తగ్గిపోతున్నాయని ఫ్రీడమ్ హౌస్, వీ--డెమ్ ఇనిస్టిట్యూట్, రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ మొదలైన సంస్థలు నిర్ధారిస్తున్నాయి. వివిధ సూచికల ఆధారంగా ఏ దేశాలు స్వేచ్ఛాయుతమైనవో, ఏ దేశాలు స్వేచ్ఛాయుతమైనవి కావో అవి వర్గీకరిస్తాయి. కేవలం ఎన్నికల నిర్వహణను మాత్రమే కాకుండా, కొన్ని నిర్దిష్ట ప్రమాణాల ప్రాతిపదికన అవి నిర్ణయానికి వస్తాయి. మొత్తం మీద ప్రజాస్వామ్య పాలన విషయంలో చాలా దేశాల స్కోరు అంతకంతకూ పడిపోతోంది. 2005లో భారత్ స్కోరు 77 కాగా అది ఇప్పుడు 63--67 మధ్య ఉన్నది. భారత్ కేవలం ఒక 'ఎన్నికల ప్రజాస్వామ్యం' మాత్రమేనని వీ--డెమ్ అభిప్రాయపడింది. మన దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, సక్రమంగా జరగడం క్రమంగా తగ్గిపోతోంది. ప్రజాస్వామిక పాలనకు సంబంధించి ప్రపంచంలో మన స్థానం పడిపోతుండడం పట్ల భారత ప్రజలు కలతచెందడం లేదు. ప్రభుత్వాలు సమకూరుస్తున్న సంక్షేమ చర్యలకు వారు సంతృప్తి చెందుతున్నారు. మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకిరావడం వారిని ఆనందపరుస్తోంది. ప్రజాస్వామిక పాలనలో చైనా స్కోరు చాలా సంవత్సరాల పాటు 9/100గా ఉన్నది. అయితే చైనా ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని అన్ని అంతర్జాతీయ సంస్థల నివేదికలు ఘంటాపథంగా చెప్పాయి. భారత్ సైతం అదే మార్గంలోకి వెళ్లవచ్చు.

దేశ ఆర్థికవ్యవస్థ ఆరోగ్యదాయకంగా ఉందని చెప్పగలమా? మన ఆర్థిక వ్యవస్థలోని అనేక రంగాలలో డ్యూపోలీ (ద్విస్వామ్యం-- ఒక మార్కెట్‌లో ఒక ఉత్పత్తి లేదా సేవను అందించేవి కేవలం రెండు ప్రధాన కంపెనీలు ఉండడం) లేదా ఒలిగోపోలీ (పరిమితస్వామ్యం-- ఒక మార్కెట్‌లో పెద్ద విక్రేతలు వేళ్ల మీద లెక్కపెట్టదగిన కొద్దిమంది మాత్రమే ఉండడం) ప్రాబల్యంలోకి వెళ్లిపోవచ్చు. విమానయానం, టెలికమ్యూనికేషన్స్, సిమెంట్, స్టీల్, విద్యుత్, ఫార్మా, పెట్రోలియం, రక్షణ ఉత్పత్తులు, మైనింగ్, కిరాణం మొదలైనవి అందుకు నిదర్శనాలు. మిగతా రంగాలలో కూడా త్వరలోనే ఇదే తరహా ధోరణులు ప్రబలిపోవచ్చు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ)లు దాదాపుగా అంతరించిపోవచ్చు. ఎన్జీవో అణచివేతకు గురవుతాయి. మొత్తం మీద పరిస్థితులు పూర్తిగా గుత్తాధిపత్య సంస్థలకు అనుకూలంగా మారతాయి. పెట్టుబడి, శ్రమశక్తి మధ్య సమతౌల్యత యథావిధిగా పెట్టుబడికి అనుకూలంగా ఉండడమే కొనసాగుతుంది. ఆదాయ అసమానతలు మరింతగా పెరుగుతాయి. ఆర్థిక సమానత్వాలు అసాధ్యమైపోతాయి.

వలసలు పెరిగిపోతాయి. అస్తిత్వాలు అర్థం కోల్పోతాయి. చాలా పెద్ద నగరాలు కాస్మోపాలిటన్ నగరాలుగా పరిణమిస్తాయి. భాషల, మతాల, సంస్కృతుల మేళవింపు నెలవులుగా ఆ మహానగరాలు వెలుగొందుతాయి. అనేక పట్టణాలు సైతం అదే రీతిలో అభివృద్ధి చెందుతాయి. పట్టణీకరణ ధోరణులు వ్యాప్తి చెందుతాయి. మాస్ ట్రాన్సిట్ సిస్టమ్ (నగరాల్లోని లక్షలాది ప్రజలు ఒకేసారి సురక్షితంగా, తక్కువ ఖర్చుతో ప్రయాణించడానికి ఉపయోగపడే ప్రజా రవాణా వ్యవస్థ) అభివృద్ధి చెందుతుంది. ఏ ఒక్కరూ 'ఒక ప్రదేశానికి చెందినవారై' ఉండరు. 'స్వస్థలం' అనే భావన ఉమ్మడి కుటుంబ ఆచారం వలే అంతరించిపోతుంది. నిత్యం తటస్థపడే వ్యక్తులలో అత్యధికులు కొత్తవారై ఉంటారు. స్నేహ సంబంధాల పరిధి కుంచించుకుపోతుంది. సోషల్ మీడియా, చాటింగ్ యాప్స్ వీడియో కాల్స్ ద్వారానే సంబంధాలు ఏర్పడతాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే మనుషుల మధ్య ప్రత్యక్ష సంబంధాలు, భావోద్వేగాలు తగ్గిపోతాయి. మనుషుల మధ్య సంభాషణలు స్మార్ట్ ఫోన్లు మొదలైన ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా సంధానమవుతాయి. 'ఏ మనిషీ ఒక ద్వీపం కాదు' అన్న భావన తప్పు అని రుజువవుతుంది. ఆత్మీయతలు, భావోద్వేగాలు కాకుండా వ్యాపార లావాదేవీలే మనుషుల మధ్య సంబంధాలను నిర్ణయిస్తాయి.

సాంస్కృతిక జాతీయవాదం ప్రబలిపోతుంది. మైనారిటీ వర్గాలలో భయాందోళనలు పెరిగిపోతాయి. శాస్త్రం(సైన్స్)ను మిథ్యాశాస్త్రం (సూడో--సైన్స్) నుంచి వేరు చేసే రేఖ చెదిరిపోతుంది. పురాణాల మిడి మిడి జ్ఞానాన్ని సైన్స్‌గా, కల్పిత గాథలు చరిత్రగా, ఆచారాలను సాంకేతికతగా ప్రచారం చేస్తారు. రుజువుల ఆధారంగా సత్యాన్ని ఆవిష్కరించే పద్ధతులు తిరస్కరణకు గురవుతాయి. పురాణ గాథలు, పునర్జన్మలు వేదాలలోని జీవశాస్త్ర విషయాలపై మరింత లోతైన పరిశోధన చేయవల్సిందిగా ఐఐటీలపై ఒత్తిడి పెరిగే అవకాశమున్నది. సాంస్కృతిక పునరుద్ధరణ అనేది ఆలయాల పునర్నిర్మాణం, హిందూ మత పండుగల నిర్వహణ చుట్టూ పరిభ్రమిస్తుంది. పలు పట్టణాలలో మాంసం విక్రయశాలలను మూసివేయవచ్చు. పశ్చిమ బెంగాల్‌ను అనుసరించి మధ్యాహ్న భోజన పథకంలో కోడిగుడ్లను ఇవ్వడాన్ని నిలిపివేస్తారు. మరిన్ని రాష్ట్రాలు ఉమ్మడి పౌరస్మృతులను ఆమోదించి అమలులోకి తీసుకువచ్చే అవకాశం ఉన్నది. హిందూత్వ అజెండా పట్ల వ్యతిరేకతను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తారు. ఒకే ఒక్క భాషలో మాట్లాడగల, రాయగల సామర్థ్యమున్న బాలల, వయోజనుల సంఖ్య మరింతగా పెరగడం ఖాయం (ఆ ఏకైక భాష హిందీ కాక మరేమవుతుంది?). మతపరమైన, భాషాపరమైన, జాతిపరమైన మైనారిటీలు నిత్యం భయాందోళనలతో బతికే పరిస్థితులు దాపురిస్తాయి.

ఇంతవరకు పేర్కొన్న పరిస్థితుల పర్యవసానాలు ఏమిటి? 144 కోట్ల మంది భారతీయుల భవిష్యత్తు ఎలా పరిణమించనున్నది? ఈ జనాభా 167 కోట్లకు పెరిగి, ఆ తరువాత క్రమంగా తగ్గిపోవడం ప్రారంభమవుతుంది. భారతీయులు ఆహారాన్ని, సరుకులను సమృద్ధంగా ఉత్పత్తి చేస్తున్నారు. వాటిని అధికాధికంగా వినియోగించుకుంటున్నారు. గణనీయంగా ఎగుమతి చేస్తున్నారు. కనుక ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, దేశ ఆర్థిక వ్యవస్థ 5శాతం లేదా అంతకంటే ఎక్కువ వార్షిక వృద్ధిరేటుతో పురోగమిస్తూనే ఉంటుంది. సంపన్నులు, కుబేరుల సంఖ్య మరింతగా పెరుగుతుంది. అయితే పేదల సంఖ్య అంతకంటే ఎక్కువగా అధికమవుతుంది. వారి జీవన ప్రమాణాలు నాసిరకంగా ఉంటాయి. ఏదో ఒక సాకుతో భారత్ అభివృద్ధిలో భాగస్వాములు కాకుండా కోట్లాది ప్రజలను మినహాయిస్తే వారి పరిస్థితి మరింత దిగజారుతుంది. అన్ని రకాల అసమానతలు పెరిగిపోతాయి. ప్రజల్లో అసంతృప్తి, ఆగ్రహావేశాలు పెరిగిపోతాయి.

'ప్రజాస్వామ్య ప్రమాణాల పతనం, ఆర్థిక గుత్తాధిపత్యాల పెరుగుదల, పట్టణీకరణ విస్తరణ, సాంస్కృతిక జాతీయవాద ప్రాబల్యం, ధనిక--పేద వ్యత్యాసాలు అధికమవడం' ముంచుకొస్తున్న అనివార్య పరిణామాలు. ఈ ఐదు ఆర్థిక, సామాజిక, రాజకీయ ధోరణులను మీరు నిరాకరించవచ్చు లేదా వాటికి మరికొన్నిటిని కలపవచ్చు లేక వాటి నుంచి కొన్నిటిని తీసివేయవచ్చు. ఏది చేసినా, దేశం ఏ దిశగా పోతుందో మీరు కాదనలేరు. ప్రపంచంలో భారత్ స్థానాన్ని నిర్ణయించేవి అవే.

## హనుమాన్ టెంపుల్ గోడ ను కూల్చి హిందువుల మనోభావాలను కించపర్చద్దు

-బిజెపి యువమోర్చ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్

( జూన్ - 30- హంస కలంవార్త )

సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నుండి గాజుల రామారం వెళ్ళే ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఎల్లమ్మబండ చౌరస్తాలో ఉన్న హనుమాన్ టెంపుల్ ప్రహరీ గోడను కూల్చడానికి అధికారులు మార్క్ వేసిన సందర్భంగా హిందూ సంఘాల ఆద్వర్యంలో బిజెపి జిల్లా నాయకులు కమలాకర్ రెడ్డి నేతృత్వంలో హనుమాన్ టెంపుల్ ముందు ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో బిజెపి యువమోర్చ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ స్థానిక బిజెపి నాయకులతో కలిసి పాల్గొని టెంపుల్ గోడను కూల్చే ఆలోచనను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులు ధనవంతుల ఇండ్లు ఉన్నచోట ఎనభై ఫీట్లు నిరుపేదల నివాసాల





వద్ద వంద ఫీట్ల రోడ్డు వెయ్యడం సరైనది కాదు అన్నారు.ఒక వర్గానికి తల్లి ప్రేమ చూపించి మరొక వర్గానికి సవితి ప్రేమ చూపించి హనుమాన్ టెంపుల్ గోడను కూల్చేయడం హిందువుల మనోభావాలను కించపర్చినట్టే అన్నారు. ఎం ఎల్ ఏ కావాలని కక్షతోటి టెంపుల్ గోడను కూల్చడంలో ఆంతర్యమేమిటో హిందువులకు చెప్పాలి అని అన్నారు. వెంటనే ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్ణయాన్నే వెనుకకు తీసుకొని దేవాలయాన్ని కాపాడాలి అన్నారు. హిందువుల మనోభావాలను కాపాడాలని బిజెపి రాష్ట్ర నాయకులు కేశవ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రామరాజు,దుర్గ ప్రసాద్, కృష్ణం రాజు, నరసింహ చారి, రాజు, వెంకటస్వామి, శ్రీనివాస్ రెడ్డి, తిరునగరి శ్రీనివాస్, రమేష్, సంతోష్, ప్రవీణ్, రాహుల్, నరసింహ, శ్రీను, భరత్, బాలు, అంజి,మురళి తదితరులు పాల్గొన్నారు....

## మద్యం మత్తులో కుటుంబ కలహాలు.. యువకుడు ఆత్మహత్య

( జూన్ - 30- హంస కలంవార్త )

బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హరిజన బస్తీలో విషాదం చోటుచేసుకుంది. టేక్మాల్లా శ్రీకాంత్ (28) అనే యువకుడు మంగళవారం ఉదయం తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ నర్సింహా రాజు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీకాంత్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ భార్య యామిని, నాలుగేళ్ల కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నాడు. అతనికి మద్యం సేవించే అలవాటు ఉండటంతో తరచూ భార్య, కుటుంబ సభ్యులతో గొడవలు జరిగేవని తెలిపారు. సోమవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన శ్రీకాంత్ భార్య, అత్తతో మరోసారి వాగ్వాదానికి దిగాడు. ప్రతిరోజూ మద్యం తాగి గొడవలు చేయొద్దని అత్త మందలించడంతో వివాదం మరింత పెరిగింది. దీంతో




భార్య యామిని, అత్త ఆ రాత్రి పక్కింట్లో నిద్రించారు. మంగళవారం ఉదయం సుమారు 6:30 గంటలకు ఇంటికి వెళ్లి చూడగా, శ్రీకాంత్ ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే స్థానికుల సహాయంతో అతడిని దించి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఈ ఘటన జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

## మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం - మీ సహాయం

( జూన్ - 30- హంస కలంవార్త )

సోమవారం కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం లోపట్నూతల గ్రామానికి చెందిన రామాచారి సుజన దంపతుల 4 సంవత్సరాల చిన్నారి "నిత్విక" 25-06-2026 తేదీన దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆ పాపం పసిమొగ్గను కోల్పోయిన ఆ కుటుంబం పడుతున్న వేదన వర్ణనాతీతం. ఈ విషాద సమయంలో ఆ కుటుంబానికి అండగా నిలిచి, విశ్వబ్రాహ్మణ ఆర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బ్రహ్మశ్రీ కే.యం. కిరణ్ కుమార్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, ఆర్థిక నేరాల విభాగం, క్రైమ్ బ్రాంచ్, హైదరాబాద్ వారు ?50,000/- ఆర్థిక సహాయం అందజేశారు.ఒక ఉన్నత పోలీస్ అధికారిగా ఉండి, తన సామాజిక బాధ్యతను గుర్తించి బాధిత కుటుంబానికి వెంటనే స్పందించి ఆదుకున్న బ్రహ్మశ్రీ కిరణ్ కుమార్ కి



అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్, ఆంధ్రప్రదేశ్ శాఖ తరఫున హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలుపుతున్నాము.కిరణ్ కుమార్ స్ఫూర్తితో ప్రతి విశ్వబ్రాహ్మణుడు, ప్రతి మానవతావాది రామాచారి సుజన కుటుంబానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నాము. మీకు తోచిన సహాయం చేసి ఆ కుటుంబానికి భరోసా కల్పించండి.

**సహాయం చేయదలచిన వారు:**

PhonePe / Google Pay: 7989192137

నిత్విక ఆత్మకు శాంతి చేకూరాలి. ఆ కుటుంబానికి మనోధైర్యం కలగాలి. హంతకులకు కఠిన శిక్ష పడాలి.

ఇట్లు,
దేవపూజ ధనుంజయ్య ఆచారి
అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్
ఆంధ్రప్రదేశ్ శాఖ
సెల్: 70133 52858

## సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఘన వీడ్కోలు

( జూన్ - 30- హంస కలంవార్త )

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయశీ ఆడిటోరియంలో మంగళవారం రోజు 14 మంది పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ సెల్‌లో సేవలందించిన ఎస్ఐ జాకీర్ హుస్సేన్, సీటీసీలో పనిచేసిన ఎస్ఐ వెంకట్ రెడ్డి, షాబాద్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఎస్ఐ శంకర్ రెడ్డి, సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ నాగరాజులు, పీసీఆర్‌కు చెందిన ఎస్ఐ షేక్ షబుద్దీన్, రామచంద్రాపురం పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన ఎస్ఐ నారాయణ గౌడ్, షీ టీమ్స్‌లో సేవలందించిన ఎస్ఐ శ్రీనివాస్, ఆమనగల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన ఎస్ఐ సీతారాం రెడ్డి పదవీ విరమణ పొందారు. వీరితో పాటు ఆమనగల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ ఎస్. మురళీధర్, మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఏఎస్ఐ మాణిక్ రెడ్డి, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన ఏఆర్ఎస్ఐ సుబ్బరాయుడు, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో పనిచేసిన ఏఆర్ఎస్ఐ మాణిక్ రెడ్డి,



పీసీఆర్ సైబరాబాద్‌లో సేవలందించిన పీసీ ఎ. లక్ష్మణ్ నాయక్, నార్సింగి పోలీస్ స్టేషన్‌కు చెందిన హెచ్.జి. ఎం. నగేష్, సగర్వంగా పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ, పదవీ విరమణ పొందుతున్న తన సహచర పోలీసు అధికారులు, సిబ్బందికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు సేవలందించిన ప్రతి ఒక్కరికీ ఎన్నో అనుభవాలు, మధుర జ్ఞాపకాలు ఉంటాయని అన్నారు. జీవితంలో సగానికి పైగా కాలాన్ని పోలీస్ శాఖకు అంకితం చేస్తూ, కుటుంబం కంటే విధులకే అధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రజల భద్రత కోసం అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. పోలీస్ కుటుంబ సభ్యులు కూడా ఎంతో క్రమశిక్షణతో, సహనంతో పోలీసు ఉద్యోగుల సేవలకు అండగా నిలిచారని, వారి త్యాగం కూడా అభినందనీయమని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందుతున్న అధికారులు, సిబ్బంది ఆయురారోగ్యాలతో, ఆనందంగా, కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో విశ్రాంతి జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. అలాగే, అవసరమైన సందర్భాల్లో పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బంది తమ అనుభవాలను, సేవలను పోలీస్ శాఖతో పంచుకుంటూ శాఖ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అనంతరం పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బందిని ఘనంగా సత్కరించి జ్ఞాపికలతో పాటు వారి పెన్షన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ శ్రీమతి టి. అన్నపూర్ణ, ఎస్ బీ డీసీపీ సుధీంద్ర, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ఏడీసీపీలు, ఏసీపీలు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొని పదవీ విరమణ పొందిన సహచరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## మెరుగైన వైద్యం అందించాలి

జిల్లా కలెక్టర్ కె.హైమవతి

( జూన్ 30 హంస కలం వార్త )

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి మంగళవారం ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఓ పి రిజిస్టర్, అటెండెన్స్ రిజిస్టర్ వెరిఫై చేశారు. మెడికల్ ఆఫీసర్ మరియు మెరుగైన వైద్యం అందించాలనిసిఎచ్ఓ - సూపర్ వైజర్ లు ఫీల్డ్ లో ఉన్నట్లు సిబ్బంది తెలపగా వారికి వీడియో కాల్ లో ... ఫీల్డ్ ఉన్నారా అని నిజనిర్ధారణలో గ్రామాల్లో ఇంటింటికి పోలియో చుక్కల వేసే కార్యక్రమం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కి తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళితే తప్పనిసరిగా పి హెచ్ సి కి వచ్చి అటెండెన్స్ రిజిస్టర్లో సంతకం పెట్టాకే ఫీల్డ్ కి వెళ్లాలని, ఫీల్డ్ వివరాలు సైతం అటెండెన్స్ రిజిస్టర్



లో మెన్షన్ చేయాలని మెడికల్ ఆఫీసర్ ను హెచ్చరించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి అన్ని మెడికల్ పరికరాలు, మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

## ఏవీబీ పురం స్థానికుల సమస్యలను ప్రభుత్వ అధికారులు వెంటనే పరిష్కరించాలి జనసేన నాయకులు: ప్రేమ కుమార్

( జూన్ - 30- హంస కలంవార్త )

కూకట్ పల్లి నియోజకవర్గంలోని ఏవీబీ పురం వాసుల పిలుపు మేరకు నియోజక వర్గం జనసేన పార్టీ కంటెస్ట్ ఎంఎల్ఏ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ కాలనీ వెళ్లి ప్రెసిడెంట్ సింహాద్రి , ప్రధాన కార్యదర్శి వెంకట్ రావు మరియు స్థానికులు తో కలిసి కాలనీ లో తిరుగుతూ అక్కడ నివాసం ఉంటున్న వారు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా



ప్రేమ కుమార్ మాట్లాడుతూ ఏవీబీ పురం లో మోరీలు నిత్యం పొంగుతున్నాయని, వర్షకాలం మరి ఎక్కువ సమస్యగా ఉందని, సుమారు వంద కుటుంబాలు నివాసం ఉంటున్న సెంట్ . రిటా హై స్కూల్ వెనుక,రోడ్ నంబర్ - 11 లొ మంజీర మరియు డ్రైనేజీ సౌకర్యం లేకపోవడం బాధాకరం అని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించి నివాసులకు ఊరట నివ్వాలని కోరారు . ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, శివశంకర్ కాలనీ ఆర్. వాసు,గోవింద్,లక్ష్మీనారాయణ,బాబూరావు భాస్కర్ రావు, తిరుపతి,ప్రసాద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు.



( జూన్ - 30- హంస కలంవార్త )

మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలం ఔషాపూర్ గ్రామం లోని రాక్ కన్వెన్షన్ సెంటర్‌లో రాష్ట్ర పార్టీ అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు అధ్యక్షతన నిర్వహించిన భారతీయ



జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు సహచర నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సమావేశానికి బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ , కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి , బండి సంజయ్ , బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ (మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు) తదితర ముఖ్య నాయకులు హాజరయ్యారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, రాబోయే కార్యాచరణ, ప్రజా సమస్యలపై పార్టీ తీసుకోవాల్సిన నిర్ణయాలు తదితర అంశాలపై ఈ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చలు జరిగాయి.

## రుచికరంగా వండి... విద్యార్థులకు కడుపునిండా వడ్డించాలి

జిల్లా కలెక్టర్ కె. హైమావతి

( జూన్ - 30- హంస కలంవార్త )

మధ్యాహ్నం భోజనం కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని, వండిన ప్రతి వంటకం రుచికరంగా విద్యార్థులకు కడుపునిండా వడ్డించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. చిన్నకోడూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నం, సాంబారు, వంకాయ ఆలుగడ్డ టమాట అన్ని కలిపిన కూర లను తనిఖీ చేస్తూ విద్యార్థులు హాజరు ప్రకారం కూరగాయలు కొలత ప్రకారం తీసుకున్నారా విద్యార్థులకు సరిపోతుందా అరా తీశారు. చేసిన ప్రతి వంటకం విద్యార్థులకు సరిపోయేంత వండి వడ్డించాలని లేనియెడల సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం చేస్తూ విద్యార్థులతో ఆప్యాయంగా పలకరిస్తూ భోజనం ఎలా ఉంది, రోజు ఎలా పెడుతున్నారు, మెనూ పాటిస్తున్నారా, అందరికి సరిపోతుందా అని అడగ్గా బాగుంటుందని అందరికీ సరిపోతుందని విద్యార్థులు కలెక్టర్కు తెలిపారు. ఆహార పదార్థాలను బాగా నమిలి తినాలని అన్నం పరబ్రహ్మ స్వరూపమని వృధా చేయకుండా శుభ్రంగా తినాలని సూచించారు. శారీరకంగా దృఢంగా ఉంటేనే మానసికంగా దృఢంగా ఉంటారని అన్ని కూరగాయలు ఇష్టంగా తినాలని తెలిపారు. కూరల నాణ్యత మరియు రుచి మెరుగుపరచాలని కూరలో ఇష్టానుసారంగా ఉప్పు- కారం తో ఎలా ఉన్నా పిల్లలు ఏం అడగకుండా తింటారని నిర్లక్ష్యం వైఖరి సహించేది లేదని, ప్రతిదీ సమపాళ్లల్లో వేసి విద్యార్థులకు పెట్టాలని ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సలీం తదితరులు ఉన్నారు.

## మైనార్టీ మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం

జూన్ 30 హంస కలం వార్త

నిజామాబాద్ పట్టణంలోని న్యాక్ సెంటర్‌లో మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో, తెలంగాణ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ గారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. స్వయం ఉపాధి ద్వారా మహిళలు తమ కుటుంబాలకు అండగా నిలిచి, గౌరవప్రదమైన జీవనం సాగించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. నిజామాబాద్ జిల్లాలో రూ. 1.02 కోట్ల వ్యయంతో మొత్తం 1,700 కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నామని, అందులో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన 500 మంది మహిళలకు కుట్టు మిషన్లు అందించడం సంతోషకరమని తెలిపారు. ఈ పథకం ద్వారా అనేక కుటుంబాలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని రంగాల్లో మైనార్టీల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కుట్టు మిషన్లు పొందిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చిన్న పరిశ్రమలుగా అభివృద్ధి చెందాలని, మరికొందరికి కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, నుడా చైర్మన్ కేశ వేణు, రత్నాకర్ , జావిద్ అక్రమ్ , షీూ పహీం , నయీమ్, కరీం, పాప ఖాన్, హాఫీస్ లయీక్ ఖాన్ , హరూన్ ఖాన్,మైనార్టీ వెల్ఫేర్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా లబ్ధిదారులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## దళిత సామాజిక వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా





జూన్ 30 హంస కలం వార్త

దళిత సామాజిక వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ సంఘాల ప్రతినిధులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత నెల 15 న నిర్వహించిన సమావేశంలో ప్రతినిధులు ప్రస్తావించిన వివిధ సమస్యలు, అభ్యర్థనలపై శాఖల వారిగా సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే సమస్యల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని స్పష్టం చేశారు. అర్హులైన ఎస్సీ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు,లేబర్ కార్డ్స్ అందజేత వంటి అంశాలపై అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలనీ,ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు అందించిన ఆర్థిక సహాయం వివరాలను,ప్రభుత్వ ఎస్సీ సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరేలా తీసుకున్న చర్యలను నిశితంగా పరిశీలించాలన్నారు. రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమం, విద్య, వైద్యం తదితర శాఖల అధికారులు క్షేత్రస్థాయి సమస్యలను నిశితంగా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, రాజేశ్వర్,డీఆర్‌ఓ స్రవంతి,జెడ్పీ సీఈఓ రవి,డీఆర్‌డీఓ రవీందర్,జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి బీ సునీత కుమారి,ఈడి మనోహర్, ఇతర శాఖల అధికారులు,ఎస్సీ సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం ఆధ్వర్యంలో ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్ బి.రాహుల్ కి సన్మానం

-గిరిజన ప్రాంతంలో ప్రత్యేక వైద్య కేంద్రంలో

-కేన్సర్ నిర్ధారణ కొరకు చర్యలు చేపడతాం.. పీవో

జూన్ 30 హంస కలం వార్త

భద్రాచలం పట్టణంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్ బి.రాహుల్ ని కలిసి, ప్రతిష్టాత్మకమైనటువంటి "దేశంలోనే అత్యుత్తమ ప్రాజెక్టు ఆఫీసర్"గా "జాతీయ గౌరవం – గుర్తింపు" పొందిన ప్రాజెక్టు ఆఫీసర్ రాహుల్ ని సన్మానించారు. ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా గిరిజన ప్రాంతంలో అమలు పర్చినందుకు ట్రైబల్ వెల్ఫేర్ మ్యూజియం స్థాపించినందుకు, విద్యాశాఖలో, వైద్యశాఖలో వినూత్నమైనటువంటి పథకాలను అమలుపర్చినందుకు, వారికి గుర్తింపు రావడం గర్వకారణం, గిరిజన సంక్షేమం కొరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహించిన అంధత్వ నివారణ, కేన్సర్ నివారణ శిబిరాలను నిర్వహించుటకు పీవో సహాయ సహకాల వలన 2500 మందికి కంటి ఆపరేషన్లు, 400 మందికి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం వలన అందరికీ కంటి చూపు మెరుగుపడిందని, వైద్యసేవలు మెరుగు పడినాయని రెడ్ క్రాస్ జిల్లా కన్వీనర్ డా" ఎస్.ఎల్.కాంతారావు తెలిపారు. గిరిజన ప్రాంతంలో వైద్యసదుపాయాలు విస్తృత పర్చుటకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాలతో సెక్రటరీ టు గవర్నర్ దాన కిషోర్, రాష్ట్ర ఐఆర్సిఎస్ కార్యదర్శి ఎ. శ్రీరాములు సూచనలతో ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ , అడిషనల్ డైరెక్టర్ డి. వేణుగోపాల్ పాల్వంచలో రెడ్ క్రాస్ సంస్థ భవన నిర్మాణానికి 0.10 జిటిఎస్ స్థలాన్ని కేటాయించినారని, ఈ స్థలం నందు ప్రత్యేక వైద్య కేంద్రం ఏర్పాటు చేయాలని, అందులో ఉచిత కేన్సర్ నిర్ధారణ, ఉచిత డయాలసిస్ సెంటర్, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని దీని వలన గిరిజన సంక్షేమం, వైద్య సదుపాయలు విస్తృతపరచాలని కోరగా, ప్రాజెక్టు ఆఫీసర్ వెంటనే స్పందించి తగు చర్యలు చేపడతామని తెలపగా, వారికి రెడ్ క్రాస్ తరపున డా" ఎస్.ఎల్.కాంతారావు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డా" ఎస్.ఎల్. కాంతారావు జిల్లా కో-ఆర్డినేటర్, డా"యం. వి. కోటిరెడ్డి, డా"భాను ప్రసాద్, రొటేరియన్ కె. అబ్రహాం, లయన్ గాదె మాధవరెడ్డి , లయన్ చావా లక్ష్మీనారాయణ, డా"పి.రాజశేఖర్, లయన్ వై. సూర్యనారాయణ, రొటేరియన్ జి, రాజారెడ్డి, ఆదినారాయణ, వి కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



# కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య బోధన్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక

-కలెక్టర్ పర్యవేక్షణలో పారదర్శకంగా ఎన్నిక ప్రక్రియ

-ఎక్స్ అఫిషియో ఓటును వినియోగించుకున్న ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

జూన్ 30 హంస కలం వార్త

బోధన్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియను మంగళవారం కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య నిర్వహించారు. బోధన్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ ఎన్నిక ప్రక్రియ కలెక్టర్ ఇలా త్రిపాఠి పర్యవేక్షణలో కొనసాగింది. ఎక్స్ అఫిషియో సభ్యుని హోదాలో ప్రభుత్వ సలహాదారు, స్థానిక ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి కో ఆప్షన్ సభ్యుల ఎన్నికలో పాల్గొన్నారు. సరిపడా కోరంను నిర్ధారించుకున్న మీదట ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు. ఎక్స్ అఫిషియోను కలుపుకుని మొత్తం 39 మందికి గాను, పూర్తి స్థాయిలో 39 మంది సభ్యులు హాజరయ్యారు. ఆయా కేటగిరీల వారీగా కో ఆప్షన్ పదవి కోసం వచ్చిన ప్రతిపాదనల మేరకు పేర్లను చదువుతూ, చేతులు ఎత్తే పద్ధతి ద్వారా నలుగురు సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నిక ప్రక్రియను ప్రిసైడింగ్ ఆఫీసర్ ప్రకటించిన తదుపరి 12 మంది ఎంఐఎం కౌన్సిలర్లు ఎన్నికను బహిస్కరిస్తున్నామని ప్రకటించి సమావేశం హాల్ నుండి బయటకు వెళ్లిపోయారు. మిగతా సభ్యులతో ఎన్నిక ప్రక్రియను కొనసాగించారు. నాలుగు కోఆప్షన్ పదవులకు గాను మొత్తం 35 దరఖాస్తులు రాగా, పేర్లను చదువుతూ, చేతులు ఎత్తే పద్ధతి ద్వారా కో ఆప్షన్ సభ్యులను ఎన్నుకున్నారు. ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా నిబంధనలను పక్కాగా పాటిస్తూ, వీడియో చిత్రీకరణ మధ్య పూర్తి పారదర్శకంగా ఈ ఎన్నిక ప్రక్రియ జరిపించారు. మెజారిటీ సభ్యుల (19 మంది) మద్దతు మేరకు దండు సంగ్రామ్, మాసుల లక్ష్మి, మహమ్మద్ ఇమ్రాన్, రఫీయా బేగంలు కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ ఆఫీసర్ జాదవ్ కృష్ణ ప్రకటించారు. నూతనంగా కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన వారికి నియామక ధృవీకరణ పత్రాలు అందజేశారు. కో ఆప్షన్ ఎన్నికను పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయం వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నూతనంగా ఎన్నికైన కో ఆప్షన్ సభ్యులకు ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అభినందలు తెలియజేశారు. ఈ ఎన్నిక ప్రక్రియలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసీల్దార్ విఠల్, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

జూన్ 30 హంస కలం వార్త

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న నైపుణ్య అభివృద్ధి కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే చర్యలలో భాగంగా చెన్నూర్ మండల కేంద్రంలో చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కేంద్రం నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల కేంద్రంలో చేపట్టిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను సందర్శించారు. ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు మరింత వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుందని, ఈ క్రమంలో చెన్నూర్ మండల కేంద్రంలో చేపట్టిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని, గుత్తేదారు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ తో కలిసి మునిసిపల్ పరిధిలో అమృత్ 2.0 పథకంలో భాగంగా చేపట్టిన నీటి ట్యాంక్ నిర్మాణం,పైప్ లైన్ల పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు,విద్యుత్, మూత్రశాలలు, ఇతర అన్ని సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనంలో పౌష్టిక ఆహారం అందించడం జరుగుతుందని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి ఫిజిక్స్ సబ్జెక్టులో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 3, 4,11 వార్డులలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణను మండల తహసిల్దార్ మల్లికార్జున్ తో కలిసి పరిశీలించారు. జూలై 24వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి అర్హులైన ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, పూరించిన తర్వాత సేకరించాలని,ఫారాల పంపిణీ ప్రక్రియను జూలై 1వ తేదీ నాటికి పూర్తి చేసి ప్రతి రోజూ పురోగతి నివేదికలను సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో యూరియా కొరత లేదు రైతులు ఆందోళన చెందవద్దు

-యాప్ నుంచి రైతులు బుక్ చేసుకోవాలి
-జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్

జూన్ 30 హంస కలం వార్త



జిల్లాలో యూరియా కొరత లేదని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్,రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ తెలిపారు.ఫెర్టిలైజర్ యాప్,ఎరువుల సరఫరా తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్,అదనపు ఎస్పీ చంద్రయ్య, వ్యవసాయ శాఖ ఇతర శాఖల అధికారులతో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ జిల్లాలో ఫెర్టిలైజర్ యాప్ సేవలు రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు.ఈ సీజన్లో 19,513 రైతులు 60,254 సంచుల యూరియా యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్నారని,తమ సమీపంలోని షాప్ ల ద్వారా 50,283 సంచులు తీసుకువెళ్లారని వెల్లడించారు. ఇంకా 9,830 సంచులు తీసుకువెళ్లాల్సి ఉందని తెలిపారు.జిల్లాలో ఇంకా 12,292 సంచులు నిలువలు ఉన్నాయని వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు మేరకు జిల్లాలోని 20 రైతు వేదికలు,అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు,ప్రైవేట్ డీలర్ల వద్ద ఎరువుల నిలువలు ఉన్నాయని స్పష్టం చేశారు.రైతులకు సహాయం చేసేందుకు అన్ని చోట్ల సిబ్బంది ఉన్నారని తెలిపారు.ఫెర్టిలైజర్ యాప్ అప్డేట్ చేసుకోవాలని, యూరియా నిలువులు దానిలో చూపించకపోతే ఆందోళనకు గురికాకుండా దానిని రిఫ్రెష్ చేయాలని సూచించారు.రైతులు ఎవరైనా యూరియా సరఫరాలో సమస్యలు ఎదుర్కొంటే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా, శాస్త్రీయ పద్ధతిలో వినియోగి ంచాలని రైతులను కోరారు. కొందరు సోషల్,ఇతర మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్న అసత్య ప్రచారాలు నమ్మవద్దని సూచించారు. పంటల సాగుకు అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉంటాయని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ వెల్లడించారు.ఈ సీజన్ కు సరిపడా ఎరువుల నిల్వలను జిల్లాలోనే సిద్ధంగా ఉంచాలని మార్క్ ఫెడ్ అధికారులను ఆదేశించారు. ఎరువులు పక్కదారి పట్టకుండా పోలీసులు వ్యవసాయ అధికారులు చూడాలని స్పష్టం చేశారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూడాలని సూచించారు. సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం,జిల్లా సహకార అధికారి రామకృష్ణ,జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్,మార్క్ ఫెడ్ అధికారి హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి





-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్..
-సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలపై అధికారులతో సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్..

జూన్ 30 హంస కలం వార్త

సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల్లో విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంతో పాటు అన్ని మౌళిక సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, సంబంధిత ఆర్ సీఓ లతో హాస్టళ్ల నిర్వహణ, మౌళిక సదుపాయాలు, విద్యార్థుల సంక్షేమంపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హాస్టళ్లలో తాగునీరు, విద్యుత్, టాయిలెట్,డార్మెటరీ, ఫర్నిచర్, వంటశాల, డైనింగ్ హాల్, భద్రతా ఏర్పాట్లు తదితర సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని భవనాల స్థితిని పరిశీలించి, మరమ్మతులు అవసరమైన చోట వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. వసతి గృహాలను అధికారులు ఆకస్మిక తనిఖీ చేసి లోపాలను వెంటనే గుర్తించి, నివేదిక సమర్పించాలని, తదనుగుణంగా ఆయా సంక్షేమ అధికారులు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి ప్రభుత్వ విద్యాసంస్థకు జీరో విద్యుత్ బిల్లు వచ్చేలా విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కిచెన్, టాయిలెట్ వ్యర్థాలు, మురుగునీటి సమస్యలు తలెత్త కుండా ఇంకుడుగుంతల నిర్మాణాలు చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో పాఠశాలల పరిస్థితులను మెరుగ్గా తీర్చిదిద్దినట్లు, వసతిగృహాల మరమ్మతులకు నిధుల మంజూరికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ప్రతి సంక్షేమ శాఖ లో నియోజకవర్గానికి ఒకటి చొప్పున అధ్వాన్న స్థితిలో ఉన్న వసతి గృహాన్ని ఎంపికచేసి, పూర్తి స్థాయిలో తీర్చిదిద్దే విధంగా చర్యలకు నిధుల గురించి వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. వర్షాకాలం కావున అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డోర్లు, కిటికీలు వైర్ మెష్ ఏర్పాట్లు, టాయిలెట్లమరమ్మత్తులు, నీటి నిల్వ లేకుండా చర్యలు వెంటనే చేయాలన్నారు. ఆహారం విషయంలో జిల్లాలో ఎక్కడ ఫుడ్ పాయిజన్ సమస్య ఉత్పన్నం కావడానికి వీలులేదని, ఎక్కడైనా సంఘటన జరిగితే కఠినచర్యలు వుంటాయని కలెక్టర్ అన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు దగ్గరలోని వసతి గృహాలను మ్యాపింగ్ చేయాలన్నారు. వసతి గృహాల్లో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన తరువాత గ్రీవెన్స్ లలో అడ్మిషన్లు, బదిలీల కొరకు వచ్చిన దరఖాస్తులకు మిగులు సీట్లలో అవకాశం కల్పించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా బిసి, సాంఘీక సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ డిడి విజయలక్ష్మి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్, ఆయా శాఖల ఆర్ సీఓ లు, విద్యుత్ శాఖ ఏవో కె. శ్రీధర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అలంపూర్ నుంచి ప్రారంభమైన దళిత క్రైస్తవ ఆత్మగౌరవ యాత్ర





-ఎస్సీ హోదా కల్పించే వరకు పోరాటం కొనసాగుతుంది
-యాత్ర నిర్వాహకులు, తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్

జూన్ 30 హంస కలం వార్త

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే వరకు తమ పోరాటం ఆగదని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ స్పష్టం చేశారు.దళిత క్రైస్తవ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నుంచి ఐజా వరకు నిర్వహించిన సుమారు 70 కిలోమీటర్ల ఆత్మగౌరవ బైక్ ర్యాలీ మంగళవారం కొనసాగింది.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో పాటు వేలాది మంది పాస్టర్లు, దళిత క్రైస్తవులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేడే రాజీవ్ సాగర్ మాట్లాడుతూ,దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడం రాజ్యాంగబద్ధమైన హక్కు అని పేర్కొన్నారు.ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీలను, సామాజిక సంస్థలను కలుపుకుని ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.1950 రాష్ట్రపతి షెడ్యూల్డ్ కులాల ఉత్తర్వులోని పేరా-3 కారణంగా హిందూ,సిక్కు, బౌద్ధ మతాలను అనుసరించే దళితులకు మాత్రమే ఎస్సీ హోదా పరిమితమైందని,ఆ ఉత్తర్వును సవరించి దళిత క్రైస్తవులకు కూడా ఎస్సీ హోదా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకోసం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశ పెట్టాలని కోరారు. మతం మారినంత మాత్రాన కులం మారిపోదని, రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ మత స్వేచ్ఛను కల్పించిందని ఆయన పేర్కొన్నారు. ఎస్సీ హోదా లేకపోవడం వల్ల దళిత క్రైస్తవులు విద్య,ఉద్యోగ రంగాల్లో తీవ్ర అన్యాయానికి గురవుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని తీర్మానం చేశారని గుర్తు చేసిన రాజీవ్ సాగర్,ఇటీవల బీఆర్ఎస్ పార్టీ తరపున ఢిల్లీలో సంబంధిత కమిషన్ ముందు కూడా ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో క్రైస్తవ సేవా సమితి అధ్యక్షుడు సాల్మన్ రాజు,రావులపాటి మోజస్, అబ్రహం లింకన్,దళిత క్రైస్తవ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు బిషప్ వసంత్ కుమార్,వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్. కృపాకర్, ఉపాధ్యక్షుడు కేజే డానియల్, ట్రెజరర్ యోసేపు తదితరులతో పాటు అలంపూర్, రాజోలి, వడ్డేపల్లి, ఐజా, ఉండవల్లి, మానపడు మండలాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలకు రాయబారులుగా మారాలి.
-పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం.




జూన్ 30 హంస కలం వార్త

నగరంలోని జ్యోతినగర్‌లో ఉన్న సెయింట్ ఆల్ఫోన్స్ హై స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన బీ సేఫ్ - సేఫ్టీ అవేర్నెస్ ఫర్ ఎవ్రీవన్ కార్యక్రమంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా పాల్గొని రోడ్ సైన్ చార్ట్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక శాతం మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థులు 18 సంవత్సరాల వయస్సు పూర్తయ్యే వరకు, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ పొందే వరకు ఎలాంటి మోటారు వాహనాలు నడపకూడదని సూచించారు. ట్రాఫిక్ నియమాలను తాము పాటించడమే కాకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులకు కూడా అవగాహన కల్పించి రోడ్డు భద్రతకు రాయబారులుగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిర్వహించిన రోడ్డు భద్రత క్విజ్ పోటీలో సరైన సమాధానాలు చెప్పిన విజేతలకు కమిషనర్ ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను బహుమతులుగా అందజేసి అభినందించారు.అలాగే పాఠశాల విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తున్న ఐవైఎస్ఓ టీమ్ ఇండియా మరియు సేఫ్ ఇండియన్ రోడ్స్ సభ్యుల సేవలను కమిషనర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆల్ఫోన్స్ హై స్కూల్ ప్రిన్సిపాల్ సంతోష్ రెడ్డి, విశ్వనాథ్ బలరామ్, ఘనశ్యామ్ ఓజా (సీఈఓ, ఐవైఎస్ఓ టీమ్ ఇండియా ఉ యంగ్ ఇండియా మిషన్), రూపక్ ముందాడా, మొహమ్మద్ అబ్దుల్ అస్లాం, అమీనా, పాఠశాల ఉపాధ్యాయులు, సుమారు 1000 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## వరంగల్ జిల్లాలో పంట పొలంలో బంగారం లభ్యం

-వాటాల కోసం కౌలు రైతు,కూలీలు మధ్య వివాదం
-ఎంట్రీ ఇచ్చిన మాజీ భూ యజమాని పోలీసులకు సమాచారం
-ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు



జూన్ 30 హంస కలం వార్త

వరంగల్ జిల్లా చెన్నరావుపేట మండలంలోని కోపాకులపాడు గ్రామంలో ఓ వ్యవసాయ పొలంలో బంగారం లభించినట్లు ప్రచారం జరగడంతో స్థానికంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పొలాన్ని దున్నుతున్న సమయంలో బంగారం దొరికినట్లు సమాచారం రావడంతో కౌలు రైతు, కూలీలు, మాజీ భూ యజమాని మధ్య వాటాల వివాదం మొదలైంది. స్థానికుల కథనం ప్రకారం...ప్రతాప్ రెడ్డికి చెందిన వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న కౌలు రైతు బాలు దున్నుతుండగా బంగారం లభించినట్లు తెలుస్తోంది. దీంతో అక్కడ పనిచేస్తున్న కూలీలు కూడా తమకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వివాదానికి దిగారు.ఇదిలా ఉండగా,ఆరేళ్ల క్రితం ఈ భూమిని విక్రయించిన జైపాల్ రెడ్డి కూడా ఈ వివాదంలోకి వచ్చి,తనకు కూడా వాటా ఇవ్వాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.గతంలో కూడా ఇదే పొలంలో బంగారం దొరికిందనే ప్రచారం స్థానికంగా ఉండటంతో,ఈ భూమిలో మరిన్ని నిధులు ఉండొచ్చన్న ఆశతో రైతులు కౌలుకు తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. బంగారం లభ్యమైందన్న ప్రచారం నేపథ్యంలో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా,పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. బంగారం లభించిన ఘటన, యాజమాన్య హక్కులు, వాటాల వివాదంపై పోలీసులు విచారణ చేపట్టారు.

# స్పోర్ట్స్

## నాలుగుసార్లు ఛాంపియన్‌కు చుక్కలు.. జర్మనీని చిత్తు చేసిన పరాగ్వే

-ఫిఫా వరల్డ్ కప్‌లో పెను సంచలనం
-నాలుగుసార్లు ఛాంపియన్ జర్మనీ ఇంటికి
-పెనాల్టీ షూటౌట్‌లో 4-3తో పరాగ్వే చారిత్రక విజయం
-తమది మట్టి కాళ్ల ఆటన్న పరాగ్వే కోచ్
-రెండు పెనాల్టీలు ఆపి హీరోగా నిలిచిన గోల్ కీపర్



ఫిఫా వరల్డ్ కప్‌లో పెను సంచలనం నమోదైంది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా, నాలుగుసార్లు ఛాంపియన్‌గా బరిలోకి దిగిన జర్మనీకి పరాగ్వే ఊహించని షాకిచ్చింది. నేడు జరిగిన రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో పెనాల్టీ షూటౌట్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో పరాగ్వే 4-3 తేడాతో చారిత్రక విజయం సాధించి రౌండ్ ఆఫ్ 16కు అర్హత సాధించింది. నిర్ణీత సమయానికి ఇరు జట్లు 1-1తో సమంగా నిలవడంతో ఫలితం కోసం పెనాల్టీ షూటౌట్ అనివార్యమైంది. వరల్డ్ కప్ చరిత్రలో పెనాల్టీ షూటౌట్‌లో జర్మనీ ఓడిపోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. అదే సమయంలో వరల్డ్ కప్ నాకౌట్ మ్యాచ్‌లో పరాగ్వే గెలవడం కూడా ఇదే ప్రథమం. ఈ చారిత్రక విజయం అనంతరం పరాగ్వే హెడ్ కోచ్ గుస్తావో అల్ఫారో భావోద్వేగంతో స్పందించాడు. తన ఆటగాళ్లను యోధులుగా అభివర్ణించాడు. "మ్యాచ్‌కు ముందు నా దగ్గర 26 మంది యోధులు ఉన్నారు. కానీ, మ్యాచ్ తర్వాత వాళ్లు లెజెండ్స్‌గా మారిపోయారు. బహుశా మేము తర్వాతి రౌండ్‌లో ఓడిపోవచ్చు, లేదా గెలవొచ్చు. కానీ, ఈ మ్యాచ్ మాత్రం ఒక చారిత్రక ఘట్టం" అని అన్నాడు. తమ ఆటగాళ్ల నేపథ్యాన్ని, జర్మనీ ఆటగాళ్ల నేపథ్యాన్ని పోలుస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. "మా ప్రత్యర్థులు యూరప్‌లోని అత్యుత్తమ అకాడమీల్లో శిక్షణ పొందారు. కానీ, మేము ఎర్రమట్టి నేలల నుంచి వచ్చాం. మా తల్లిదండ్రులు చేసిన త్యాగాల వల్ల, బూట్లు లేకుండా ఫుట్‌బాల్ ఆడుతూ కలలను సాకారం చేసుకోవడం నేర్చుకున్నాం. ఇది మా మూలాల బలం" అని వివరించాడు. ఈ మ్యాచ్‌లో హీరోగా నిలిచిన పరాగ్వే గోల్ కీపర్ ఓర్లాండో గిల్, షూటౌట్‌లో రెండు కీలక పెనాల్టీలను అడ్డుకుని 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును గెలుచుకున్నాడు. తన ప్రదర్శన వెనుక కఠోర శ్రమ ఉందని తెలిపాడు. "ప్రతి ఆటగాడిని, ప్రతి అంశాన్ని, ప్రతి చిన్న విషయాన్ని నేను విశ్లేషించాను. దాని ఫలితంగానే రెండు పెనాల్టీలను ఆపగలిగాను. అవే మా గెలుపును నిర్ధారించాయి" అని 26 ఏళ్ల గిల్ చెప్పాడు. మ్యాచ్ మొత్తంలో జర్మనీ తమపై తీవ్ర ఒత్తిడి తెచ్చిందని, "అదొక హారర్ సినిమా చూసినట్లుంది. జర్మన్ ఆటగాళ్లు మైదానంలో ప్రతిచోటా కనిపిస్తూనే ఉన్నారు" అని వ్యాఖ్యానించాడు. జట్టు తరఫున గోల్ చేసిన జూలియో ఎన్సిసో మాట్లాడుతూ.. జర్మనీ గొప్ప జట్టు అయినప్పటికీ తాము భయపడలేదని స్పష్టం చేశాడు. "వారికి గొప్ప ఆటగాళ్లు ఉన్నారు కాబట్టి గౌరవించాం. కానీ, ఎవరికీ భయపడలేదు" అని ధీమా వ్యక్తం చేశాడు. క్వార్టర్ ఫైనల్స్‌లో స్థానం కోసం ఫ్రాన్స్, స్వీడన్ మధ్య జరిగే మ్యాచ్ విజేతతో పరాగ్వే తలపడనుంది. "తర్వాతి ప్రత్యర్థి ఎవరైనా, వారి ఆటగాళ్లు స్టార్స్ అయినా, మాకంటూ సొంత బలాలు, శైలి ఉన్నాయి. వాటితోనే వారిని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తాం" అని ఎన్సిసో పేర్కొన్నాడు.

## ఏషియన్ గేమ్స్ కోసం భారత మహిళల క్రికెట్ జట్టు ప్రకటన.. టీమ్‌లో ఒకే ఒక్క మార్పు



-15 మంది సభ్యుల భారత మహిళల క్రికెట్ జట్టును ప్రకటించిన బీసీసీఐ
-జట్టుకు కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన
-యస్తికా భాటియా స్థానంలో వికెట్ కీపర్ జి. కమలినికి జట్టులో అవకాశం
-డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత్

రాబోయే 2026 ఆసియా క్రీడల కోసం బీసీసీఐ నేడు 15 మంది సభ్యులతో కూడిన భారత మహిళల క్రికెట్ జట్టును ప్రకటించింది. కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన జట్టును ముందుండి నడిపించనున్నారు. జపాన్‌లోని ఐచి-నగోయా వేదికగా సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న ఈ మెగా ఈవెంట్‌లో భారత్ డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనుంది. గతంలో చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన ఎడిషన్‌లో భారత జట్టు చారిత్రాత్మక స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్న విషయం తెలిసిందే.

**జట్టులో ఒకే ఒక్క మార్పు**

ఇటీవల జరిగిన ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో పాల్గొన్న జట్టుపైనే సెలక్షన్ కమిటీ పూర్తి విశ్వాసం ఉంచింది. ఆ జట్టులో ఒకే ఒక్క మార్పు చేసింది. వికెట్ కీపర్ యస్తికా భాటియా స్థానంలో ఎడమచేతి వాటం బ్యాటర్, వికెట్ కీపర్ అయిన జి. కమలినికి జట్టులో అవకాశం కల్పించారు. మిగతా జట్టు యథాతథంగా కొనసాగుతోంది. ఇది జట్టు కూర్పులో స్థిరత్వాన్ని సూచిస్తోంది. బ్యాటింగ్ విభాగంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌తో పాటు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్ కీలక పాత్ర పోషించనున్నారు. స్టార్ ఆల్-రౌండర్ దీప్తి శర్మ మిడిల్ ఆర్డర్‌కు బలం చేకూర్చనుంది. వికెట్ కీపింగ్ బాధ్యతలను రిచా ఘోష్ ప్రధానంగా మోయనుండగా, ఆమెకు బ్యాకప్‌గా కమలిని ఎంపికైంది.

**బౌలింగ్ విభాగం.. శ్రేయాంక ఫిట్‌నెస్‌పై సందిగ్ధత**

పేస్ బౌలింగ్ విభాగానికి స్వింగ్ స్పెషలిస్ట్ రేణుకా సింగ్ ఠాకూర్, అనుభవజ్ఞురాలైన అరుంధతి రెడ్డి నాయకత్వం వహించనున్నారు. స్పిన్ విభాగంలో లెఫ్ట్ ఆర్మ్ ఆర్థోడాక్స్ స్పిన్నర్ రాధా యాదవ్, ఆఫ్-స్పిన్నర్ శ్రేయాంక పాటిల్, యువ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్, తెలుగమ్మాయి శ్రీ చరణి ఉన్నారు. అయితే, యువ ఆల్‌రౌండర్ శ్రేయాంక పాటిల్ ఎంపిక ఆమె ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుందని బీసీసీఐ స్పష్టం చేసింది. గతంలో చీలమండ గాయం కారణంగా ఆమె టీ20 ప్రపంచకప్‌కు దూరమైంది. ఆమె పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తేనే తుది జట్టులో కొనసాగుతుంది. 2010లో గ్వాంగ్‌జౌలో జరిగిన క్రీడల్లో తొలిసారిగా ప్రవేశపెట్టిన క్రికెట్, 2014లో ఇంచియాన్‌లోనూ కొనసాగింది. 2018 జకార్తా గేమ్స్‌లో చోటు దక్కించుకోలేకపోయినా, 2022లో విజయవంతంగా పునరాగమనం చేసింది. ఇప్పుడు వరుసగా రెండోసారి ఆసియా క్రీడల్లో క్రికెట్ భాగం కాబోతోంది.


**ఆసియా క్రీడలకు భారత మహిళల జట్టు:**

హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమలిని (వికెట్ కీపర్), భారతి ఫుల్మాలి, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్ (ఫిట్‌నెస్‌పై ఆధారపడి), రాధా యాదవ్, నందిని శర్మ.

# బిజినెస్

## ఐటీ షేర్ల అమ్మకాలతో స్టాక్ మార్కెట్లు డౌన్.. సెన్సెక్స్ 250 పాయింట్లు పతనం

-80.50 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ
-మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు లాభాల్లో
-రియాల్టీ, కెమికల్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు
-ఐటీ, మీడియా, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లపై అమ్మకాల ఒత్తిడి



దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ముగిశాయి. ఐటీ కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడం, అమెరికా-ఇరాన్ చర్చల ఫలితంపై పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించడం మార్కెట్లపై ప్రభావం చూపింది. రోజంతా హెచ్చుతగ్గుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో నిఫ్టీ 80.50 పాయింట్లు కోల్పోయి 23,865.75 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 249.70 పాయింట్లు పడిపోయి 76,478.67 వద్ద స్థిరపడింది. మార్కెట్ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. నిఫ్టీకి ప్రస్తుతం 24,000 స్థాయి ప్రధాన నిరోధంగా మారింది. ఈ స్థాయిని దాటితే మళ్లీ కొనుగోళ్ల జోరు పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. మరోవైపు 23,800 స్థాయి కీలక మద్దతుగా ఉందని, ఆ స్థాయి కంటే దిగువకు వెళితే మరింత ఒత్తిడి కనిపించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సెన్సెక్స్‌లో మారుతి సుజుకి, టైటాన్, బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభాల్లో స్థిరపడ్డాయి. మరోవైపు ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు నష్టపోయాయి. ప్రధాన సూచీలు నష్టాల్లో ముగిసినా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో కొనుగోళ్లు కొనసాగాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.37 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.02 శాతం లాభపడింది. రంగాల వారీగా చూస్తే ఐటీ, మీడియా, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లపై అమ్మకాల ఒత్తిడి కనిపించింది. రియాల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, కెమికల్స్ రంగాల షేర్లు మాత్రం కొనుగోళ్లతో లాభాల్లో ముగిశాయి.

## భారత్‌కు తీవ్ర నీటి ముప్పు.. అదే సమయంలో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులకు అవకాశం!



-2030 నాటికి అందుబాటులో ఉన్న నీటి సరఫరాకు రెట్టింపు డిమాండ్
-నీటి రంగంలో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడి అవకాశాలున్నాయని అంచనా
-పీఎల్ క్యాపిటల్ నివేదికలో వెల్లడైన కీలక వాస్తవాలు
-మురుగునీటి శుద్ధి రంగంలోనే అతిపెద్ద అవకాశాలున్నాయని వెల్లడి
'-జల్ జీవన్ మిషన్', 'నమామి గంగే' వంటి పథకాలతో ప్రభుత్వ చర్యలు

భారతదేశం రానున్న రోజుల్లో తీవ్రమైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కోబోతోందా? ఈ ప్రశ్నకు సమాధానంగా... 2030 నాటికి దేశంలో అందుబాటులో ఉన్న నీటి సరఫరా కంటే డిమాండ్ రెట్టింపు స్థాయికి చేరుకుంటుందని ఒక నివేదిక హెచ్చరించింది. అయితే, ఈ సంక్షోభమే రాబోయే దశాబ్దంలో సుమారు రూ.20 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి అవకాశాలకు మార్గం సుగమం చేయనుందని పీఎల్ క్యాపిటల్ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా జల శుద్ధి (వాటర్ ట్రీట్‌మెంట్), మురుగునీటి రీసైక్లింగ్, మురుగునీటి పారుదల మౌలిక సదుపాయాల రంగాల్లో ఈ అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. ప్రపంచ జనాభాలో దాదాపు 18 శాతం వాటా ఉన్న భారత్‌లో, ప్రపంచంలోని మంచినీటి వనరుల్లో కేవలం 4 శాతం మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వేగవంతమైన పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, భూగర్భ జలాల క్షీణత, వ్యవసాయానికి నీటి వినియోగం పెరగడం వంటి కారణాలతో నీటి కొరత తీవ్రమవుతోంది. ఈ పరిస్థితుల్లో నీటి భద్రత అనేది దేశానికి అత్యంత కీలకమైన అంశంగా మారిందని, దీనికోసం జల శుద్ధి, రీసైక్లింగ్, పంపిణీ, నిల్వ వ్యవస్థలపై భారీగా పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందని నివేదిక నొక్కి చెప్పింది. "ఇతర మౌలిక సదుపాయాల రంగాల్లో పెట్టుబడులు ఆర్థిక అంశాలతో ముడిపడి ఉండవచ్చు. కానీ, నీటి భద్రతకు సంబంధించిన పెట్టుబడులు నిర్మాణాత్మకమైనవి, విధానపరమైనవి, దేశ సుస్థిర అభివృద్ధికి ఇవి తప్పనిసరి" అని పీఎల్ క్యాపిటల్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ విక్రమ్ కసత్ వివరించారు. పట్టణీకరణ, పారిశ్రామిక వృద్ధి, పర్యావరణ ప్రమాణాలు పెరగడం వల్ల నీటి శుద్ధి, పునర్వినియోగం, డీశాలినేషన్ వంటి రంగాలకు దీర్ఘకాలికంగా ఉంటుందని ఆయన తెలిపారు. మురుగునీటి శుద్ధి రంగంలోనే అతిపెద్ద అవకాశాలు ఉన్నాయని నివేదిక స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా రోజుకు 72,000 మిలియన్ లీటర్లకు పైగా మురుగునీరు ఉత్పత్తి అవుతుండగా, దానిని శుద్ధి చేసే సామర్థ్యం చాలా తక్కువగా ఉంది. శుద్ధి చేయని నీరు నేరుగా పర్యావరణంలోకి విడుదల కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ మౌలిక సదుపాయాల లోటును పూడ్చేందుకు మురుగునీటి శుద్ధి, పునర్వినియోగ ప్రాజెక్టులపై పెట్టుబడులు వెల్లువెత్తే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 'జల్ జీవన్ మిషన్', 'అమృత్ 2.0', 'నమామి గంగే' వంటి పథకాల ద్వారా స్వచ్ఛమైన నీటి లభ్యత, మెరుగైన మురుగునీటి వ్యవస్థల కోసం కేటాయింపులు పెంచింది. మరోవైపు డేటా సెంటర్లు, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, గ్రీన్ హైడ్రోజన్ వంటి కొత్త పరిశ్రమలకు అత్యంత స్వచ్ఛమైన నీరు అవసరం కానుండటంతో పారిశ్రామిక నీటి డిమాండ్ మరింత పెరగనుంది.

## భారీగా తగ్గిన ముడిచమురు ధర.. కానీ తగ్గని పెట్రోల్, డీజిల్ రేట్లు.. కారణమిదే!

పశ్చిమాసియాలో సంక్షోభం మొదలైన తర్వాత మొట్టమొదటిసారిగా భారత్ దిగుమతి చేసుకునే ముడిచమురు సగటు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల కంటే దిగువకు పడిపోయింది. అయితే, ఈ తగ్గుదల ప్రయోజనం దేశంలోని వినియోగదారులకు వెంటనే అందే అవకాశం కనిపించడం లేదు. గతంలో ఎదుర్కొన్న భారీ నష్టాలను చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ) పూడ్చుకోవడానికి ప్రయత్నించడం, వినియోగదారులను ఆదుకునేందుకు ప్రభుత్వం భరించిన ఆర్థిక వ్యయంలో కొంత భాగాన్ని రాబట్టుకోవాలని భావిస్తుండటమే ఇందుకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. నిన్నటికి భారత క్రూడ్ ఆయిల్ బాస్కెట్ సగటు ధర బ్యారెల్‌కు 68.86 డాలర్లకు తగ్గింది. పశ్చిమాసియాలో ఫిబ్రవరి 28న ఘర్షణలు మొదలైన తర్వాత మార్చి 23న గరిష్ఠంగా 157.04 డాలర్లకు చేరిన ధరతో పోలిస్తే ఇది 56 శాతం కంటే ఎక్కువ తగ్గుదల. ఈ పరిణామం ప్రభుత్వ రంగంలోని చమురు సంస్థలకు కొంత ఊరటనిచ్చింది. ప్రస్తుతం ఈ కంపెనీలు పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 5 నుంచి రూ. 6 వరకు లాభం పొందుతున్నప్పటికీ, డీజిల్ అమ్మకాలపై మాత్రం లీటర్‌కు రూ. 8 నుంచి రూ. 10 వరకు నష్టపోతూనే ఉన్నాయి. ఈ అంశంపై ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం స్పందించలేదు. జూన్ మధ్యలో అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరే అవకాశాలు, సంక్షోభాన్ని ముగించే దిశగా అవగాహన ఒప్పందం కుదరడంతో చమురు ధరలు శాంతించడం ప్రారంభించాయి. కీలకమైన హర్మూజ్ జలసంధి నుంచి రవాణా పునఃప్రారంభం కావడంతో ధరలు మరింత తగ్గుముఖం పట్టాయి. ఈ పరిణామాలపై పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి 'ఎక్స్' వేదికగా స్పందించారు. ప్రపంచ ఇంధన షాక్ నుంచి భారత వినియోగదారులను ప్రభుత్వం కాపాడిందని ఆయన తెలిపారు. ఎక్సైజ్ సుంకం తగ్గింపు వల్ల నెలకు రూ. 14,000 కోట్లతో సహా, వినియోగదారులను ఆదుకోవడానికి కేంద్రంపై సుమారు రూ. 1.23 లక్షల కోట్ల ఆర్థిక భారం పడిందని ప్రభుత్వ అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. వివిధ దేశాల నుంచి ముడిచమురును సమీకరించడం, మౌలిక సదుపాయాలను విస్తరించడం వల్లే ఇంధన కొరత లేకుండా సంక్షోభాన్ని తట్టుకోగలిగామని పూరి తెలిపారు.

# హీరోయిన్ హనీ రోజ్ కు క్షమాపణ చెప్పిన వ్యాపారవేత్త

-ఇటీవల ఒక జ్యువెలరీ షోరూమ్ ప్రారంభోత్సవ వేడుకలో హనీ రోజ్‌పై అనుచిత వ్యాఖ్యలు
-వ్యాపారవేత్త బాబీ చెమ్మనూర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిన హనీ రోజ్
-ఆమెను బాధపెట్టే ఉద్దేశం తనకు లేదన్న బాబీ చెమ్మనూర్

కేరళకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బాబీ చెమ్మనూర్ హీరోయిన్ హనీ రోజ్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. ఒక జ్యువెలరీ షోరూమ్ ప్రారంభోత్సవ వేడుకలో హనీ రోజ్‌ను ఉద్దేశించి ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. తనపై లైంగిక భావనలతో కూడిన, అవమానకరమైన వ్యాఖ్యలు చేశారంటూ హనీ రోజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చెమ్మనూర్‌పై క్రిమినల్ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో, బాబీ చెమ్మనూర్ తన ఫేస్‌బుక్ ఖాతా ద్వారా స్పందిస్తూ, తన వ్యాఖ్యలు హనీ రోజ్‌ను, ఆమె కుటుంబాన్ని బాధపెట్టాయని గ్రహించానని... ఈ ఉదంతానికి పూర్తి బాధ్యత వహిస్తూ మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నానని ప్రకటించారు. ఆమెను బాధపెట్టాలనే ఉద్దేశం తనకు ఏమాత్రం లేదని, ఈ సమస్యను సానుకూలంగా పరిష్కరించుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. అలాగే ఆమె తనపై పెట్టిన కేసును ఉపసంహరించుకుంటారని ఆశిస్తు న్నట్లు తెలిపారు. మరోవైపు, ఈ వివాదంపై గతంలో మాట్లాడిన హనీ రోజ్... తన లుక్స్‌పై వచ్చే సరదా జోకులను, మీమ్స్‌ను తాను కూడా స్పోర్టివ్‌గా తీసుకుంటానని, కానీ ప్రతి దానికి ఒక హద్దు ఉంటుందని స్పష్టం చేశారు. అసభ్యకరమైన, గౌరవా నికి భంగం కలిగించే వ్యాఖ్యలను ఏమాత్రం సహించేది లేదని ఆమె తేల్చి చెప్పారు. వ్యాపారవేత్త చెమ్మనూర్ చేసిన ఈ బహిరంగ క్షమాపణలపై హనీ రోజ్ ఇంకా స్పందించాల్సి ఉంది.



## దేవుడికి గాయమైతే భక్తుడు తట్టుకోగలడా.. పవన్ కల్యాణ్ ఆరోగ్యంపై బండ్ల గణేశ్ భావోద్వేగ పోస్ట్



డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. నిన్న తన అర్ధాంగి అన్నా లెజినోవాతో కలిసి ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రికి వెళ్లిన పవన్, అక్కడ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆయన భుజంలోని రొటేటర్ కఫ్‌తో పాటు మరో రెండు కండరాల్లో గాయం తీవ్రత ఎక్కువగా ఉందని, వీలైనంత త్వరగా శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారు. పవన్ కల్యాణ్ కొంతకాలంగా ఈ గాయాలతో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. అయితే, ఈ గాయం వెనుక ఉన్న నేపథ్యాన్ని, నాటి సంఘటనలను గుర్తుచేసుకుంటూ ప్రముఖ నిర్మాత బండ్ల గణేశ్ సోషల్ మీడియాలో భావోద్వేగ పోస్ట్ పెట్టారు. ఈ గాయాలు సుమారు 15 ఏళ్ల క్రితం 'గబ్బర్ సింగ్' సినిమా షూటింగ్ సమయంలో తగిలినవని ఆయన వెల్లడించారు."నిన్న రాత్రంతా నిద్ర రాలేదు.. ఒకటే ఆలోచన.. ఒకటి కాదు రెండు కాదు దాదాపు పదిహేనేళ్లుగా మీరు నడుము నొప్పి, భుజం నొప్పితో ఎంత నరకం అనుభవించారో తలచుకుంటే నా గుండె బరువెక్కిపోయింది. చిన్న పంటి నొప్పి వచ్చినా మనిషి విలవిల్లాడిపోతాడు. అలాంటిది మీరు ఇన్ని సంవత్సరాలు ఆ బాధను చిరునవ్వు వెనుక దాచుకుని జీవించడం నిజంగా అసాధారణం. నాకు ఈ రోజు కూడా గబ్బర్ సింగ్ షూటింగ్ రోజులు కళ్లముందే కనిపిస్తున్నాయి. గుజరాత్‌లో జరిగిన ఆ ప్రమాదం.. గుర్రం మీద నుంచి పడిపోయిన ఆ క్షణం.. వైద్యులు వెంటనే ఆపరేషన్ చేయించుకోవాలని చెప్పిన సందర్భం.. ఇవన్నీ ఇప్పటికీ నా మనసును వెంటాడుతూనే ఉన్నాయి. ఆ సమయంలో మీరు ఒక నిర్ణయం తీసుకున్నారు. అది ఒక హీరో తీసుకున్న నిర్ణయం కాదు.. మాటకు ప్రాణం ఇచ్చే మహామనిషి తీసుకున్న నిర్ణయం.



## సమంత గర్భవతి అని తెలియగానే ఏం చేశామంటే..: నందిని రెడ్డి

దక్షిణ భారత సినీ రంగంలో తనకంటూ ఒక సొంత బ్రాండ్ సృష్టించుకున్న అగ్ర కథానాయిక సమంత త్వరలోనే తల్లి కాబోతున్న సంగతి తెలిసిందే. తన తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' షూటింగ్ సమయంలోనే ఆమె గర్భం దాల్చారు. సమంత ప్రెగ్నెంట్ అయిన విషయం గురించి దర్శకురాలు నందిని రెడ్డి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. సాధారణంగా సమంత ప్రొఫెషనలిజం ఏ రేంజ్‌లో ఉంటుందో అందరికీ తెలిసిందే. ఉదయం 9 గంటలకు షూట్ అంటే కచ్చితంగా సెట్‌లో ఉండే సమంత.. ఈ సినిమాలోని 'తస్సాదియా' సాంగ్ షూటింగ్ షెడ్యూల్ అప్పుడు సడన్‌గా తనకు జ్వరం వచ్చిందని, 11:30 గంటలకు వస్తానని నందిని రెడ్డికి సమాచారం పంపారు. మొదట నాలుగు రోజులు ప్లాన్ చేసిన ఈ సాంగ్‌ను అనుకోని కారణాల వల్ల రెండు రోజుల్లోనే కంప్లీట్ చేయాల్సి రావడం, మరోవైపు సామ్ హెల్త్ బాలేకపోవడంతో డైరెక్టర్‌గా నందిని రెడ్డి తీవ్రమైన ఒత్తిడికి లోనయ్యారు. కానీ చెప్పిన టైమ్‌కే సెట్స్‌కు వచ్చిన సమంత.. సైలెంట్‌గా షూట్ కంప్లీట్ చేసుకుని వెళ్ళిపోయారు. మరుసటి రోజు కూడా సమంత డల్ గా ఉండటంతో, అసలు నీకు ఎందుకు తరచూ జ్వరం వస్తోందని నందిని రెడ్డి గట్టిగా అడిగేశారు. ఆ సమయంలోనే సమంత నందిని రెడ్డి దగ్గరకు వచ్చి.. "నాకు జ్వరం కాదు.. నేను ప్రెగ్నెంట్‌ని, ఈ విషయం ప్రస్తుతానికి ఎవరికీ చెప్పకు" అంటూ తన జీవితంలోనే అత్యంత సంతోషకరమైన విషయాన్ని పంచుకున్నారు. ఈ సంతోషకరమైన వార్త వినగానే నందిని రెడ్డి ఒక్కసారిగా షాక్‌తో పాటు విపరీతమైన ఆనందానికి గురయ్యారు. సమంత గర్భంతో ఉందనే విషయం తెలియగానే షూటింగ్ స్పాట్‌లో విపరీతమైన జాగ్రత్తలు తీసుకున్నారు. వెంటనే డ్యాన్స్ మాస్టర్ వద్దకు వెళ్లి సమంతకు హెల్త్ బాలేదని అబద్ధం చెప్పి, ఎక్కువ రిహార్సల్స్ లేకుండా సింపుల్ స్టెప్స్‌తోనే సాంగ్ మేనేజ్ చేయాలని ఆర్డర్ వేశారు. సమంతకు మార్నింగ్ సిక్‌నెస్ (గర్భధారణ సమయంలో వచ్చే నీరసం, వాంతులు) ఉన్నప్పటికీ.. ఆ కష్టాన్ని ఏమాత్రం స్క్రీన్‌పై చూపించకుండా డ్యాన్స్ పూర్తి చేయడం విశేషం. ఆ తర్వాత షూట్ చేసిన కార్ యాక్సిడెంట్, ఛేజింగ్ సీన్స్ సమయంలో కూడా సమంతపై ఎలాంటి ప్రెజర్ పడకుండా, మధ్యాహ్నం 3:30 దాటిన తర్వాత కేవలం నీడలోనే షాట్స్ తీస్తూ షూటింగ్ పూర్తి చేశారు నందిని రెడ్డి. సమంతను స్క్రీన్‌పై బెస్ట్‌గా ప్రెజెంట్ చేయాలని తమ యూనిట్ మొత్తం కష్టపడిందని నందిని తెలిపారు.

## ఇది ప్రభాస్ రేంజ్.. బ్యాంకాక్‌లో పూరి జగన్నాథ్‌కు ఎదురైన ఊహించని అనుభవం!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ క్రేజ్ దేశ సరిహద్దులు దాటి ప్రపంచవ్యాప్తంగా ఏ స్థాయిలో విస్తరించిందో చెప్పే ఓ ఆసక్తికర సంఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. కేవలం 'నేను ప్రభాస్ స్నేహితుడిని' అని చెప్పినందుకు ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్‌కు బ్యాంకాక్‌లోని ఓ ఆసుపత్రిలో ఊహించని రీతిలో వీఐపీ ట్రీట్‌మెంట్ లభించింది. ఈ విషయాన్ని ప్రభాస్ స్వయంగా ఇటీవల విడుదలైన 'బాహుబలి: ది టార్చ్ బేరర్' అనే డాక్యుమెంటరీలో అభిమానులతో పంచుకున్నారు. ప్రభాస్ కథనం ప్రకారం.. 'బాహుబలి: ది బిగినింగ్' విడుదలై ప్రపంచవ్యాప్తంగా సంచలనాలు సృష్టిస్తున్న రోజుల్లో ఈ సంఘటన జరిగింది. దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ చిన్న ఇన్ఫెక్షన్ కారణంగా చికిత్స కోసం బ్యాంకాక్‌లోని ఓ ప్రముఖ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ తన వంతు కోసం వెయిటింగ్ రూమ్‌లో కూర్చుని ఉండగా, ఓ నర్స్ ఆయన వద్దకు వచ్చి ఇండియా నుంచి వచ్చారా? అని అడిగింది. ఆయన అవునని సమాధానం ఇవ్వగానే, ఆమె వెంటనే 'బాహుబలి?' అని ప్రశ్నించింది. ఆమె ప్రశ్నకు ఆశ్చర్యపోయిన పూరి జగన్నాథ్, తన ఫోన్‌లోని ఓ పర్సనల్ ఫోటోను చూపించారు. ఆ ఫోటోలో ఆయన ప్రభాస్‌తో కలిసి ఉన్నారు. తాను ప్రభాస్‌కు మంచి స్నేహితుడినని ఆ నర్స్‌కు వివరించారు. ఆ ఫొటో చూసిన నర్స్ వెంటనే ఆసుపత్రి సిబ్బందిని అప్రమత్తం చేసింది. దీంతో పూరి జగన్నాథ్‌కు ఎలాంటి వెయిటింగ్ సమయం లేకుండా నేరుగా ఒక ప్రత్యేక గదికి తీసుకెళ్లి, తక్షణమే వైద్య సేవలు అందించారు. ఈ అనూహ్య అనుభవాన్ని పూరి జగన్నాథ్ వెంటనే వాయిస్ మెసేజ్ రూపంలో ప్రభాస్‌కు పంపించారు. ఆ సమయంలో దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, నిర్మాత శోభు యార్లగడ్డతో కలిసి ఉన్న ప్రభాస్, ఆ వాయిస్ మెసేజ్ విని ఆశ్చర్యానికి గురయ్యారు. జపాన్ వంటి దేశాల్లో 'బాహుబలి'కి, ప్రభాస్‌కు భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందని వారికి తెలుసు. కానీ, ఎవరూ ఊహించని విధంగా బ్యాంకాక్‌లోని ఓ సాధారణ ఆసుపత్రిలో కూడా 'బాహుబలి' ప్రభావం ఈ స్థాయిలో ఉండటం చిత్రబృందాన్ని సైతం ఆశ్చర్యపరిచింది. ఇది ప్రభాస్ గ్లోబల్ స్టార్‌డమ్‌కు నిదర్శనంగా నిలిచింది. ఇదే డాక్యుమెంటరీలో ప్రభాస్, రానా దగ్గుబాటి, అనుష్క శెట్టిలు 'బాహుబలి 3' చిత్రంపై పరోక్షంగా కొన్ని హింట్స్ ఇవ్వడం అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఇక, ప్రభాస్ కెరీర్ విషయానికొస్తే.. ప్రస్తుతం ఆయన వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజీ', సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్', అలాగే 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి సీక్వెల్ కూడా ఆయన లైనప్‌లో ఉన్నాయి.



Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449